ప్రజాశక్తి

బుధవారం 22 మే 2024 8 పేజీలు

గుంటూరు పల్నాడు





రైతును చిత్తు చేస్తున్న నకిలీలు

- రెచ్చిపోతున్న అక్రమార్కులు
- మార్కెట్‌ను ముంచెత్తుతున్న కల్తీ విత్తనాలు, మందులు
- పరిహారం కోసం కాళ్లరిగేలా తిరిగినా దక్కని న్యాయం



నరసరావుపేటలో గోదాములో నకిలీ బయో ఉత్పత్తుల ముడి పదార్థాలు (ఫైల్)


ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వ్యవసాయాన్నే నమ్ముకున్న రైతు ప్రకృతి ప్రకోపానికి బలవడం ఒకెత్తయితే రైతే లక్ష్యంగా మోసాలకు పాల్పడే అక్రమార్కుల చర్యలతో రైతులు పీకల్లోతు కష్టనష్టాల్లో కూరుకుపోతున్నారు. త్వరగా పైరు వేద్దామని సాగు ఆశలో ఉండే రైతును సీజన్ ప్రారంభంలోనే నకిలీ విత్తనాలను అక్రమార్కులు ముంచెత్తి నష్టాల్లో ముంచుతున్నారు. బాధిత రైతులు తమకు న్యాయం కోసం అధికారులు, పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరిగినా వారికి న్యాయం దక్కడం లేదు.

రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని ధనార్జనే ధ్యేయంగా వ్యాపారాలు కొనసాగిస్తున్న కొందరి లాభాపేక్షకు రైతులు అప్పులపాలై ఆత్మహత్యలకూ పాల్పడుతున్నారు. కల్తీ విత్తనాలు, నకిలీ పురుగు మందులు మార్కెట్‌లో రాజ్యమేలుతున్నా వీటి నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవడంలో అధికారులు పరిమిత చర్యలతోనే సరిపెడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. అందుకే అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఇందుకు నిదర్శనం పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని సత్తెనపల్లి రోడ్డులో ఒక గోదాములో నిల్వచేసిన నకిలీ బయో మందులు, సూక్ష్మ ఎరువుల తయారీకి అవసరమైన ముడి పదార్థాలు వెలుగు చూడటమే.

గత ఏడాది ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని అనేక దుకాణాలు, గోదాముల్లో విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టిన సమయంలో రూ.10 కోట్ల

▶ 2లో



ఇవిఎంను పగలగొడుతున్న ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

2 లో

పల్నాడులో జల్లెడ పడుతున్న పోలీసులు

- కౌంటింగ్ తరువాత ఘర్షణల నివారణపై దష్టి
- ఈవీఎం ధ్వంసం కేసులో పిన్నెల్లి వీడియో వెలుగులోకి



జె.ఎన్.టి.యు కళాశాల ప్రవేశ మార్గంలో భద్రతా సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ

లెక్కింపయ్యేదాక సెలవులు అడగొద్దు

- పోలీసులకు పల్నాడు ఎస్పీ ఆదేశం
- కౌంటింగ్ పూర్తయ్యేదాక సిబ్బంది హాలులోనే ఉండాలి
- పల్నాడు కలెక్టర్ శ్రీకేష్ లత్కర్ బాలాజిరావు
- ఈవీఎంలు ఉంచిన స్ట్రాంగ్ రూం భద్రతపై పరిశీలన

2 లో



ఇసుక రీచ్‌లో సిసి కెమెరాలు

- యంత్రాలతో తవ్వకాలు నిషేధం
- పల్నాడు జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లత్కర్
- పలు ఇసుక రీచ్‌లలో పరిశీలన

6 లో

పొట్టకొట్టిన గొడవలు

- రాజకీయ అల్లర్ల సాకుతో ఉపాధి హామీ నిలిపివేత
- కుటుంబ పోషణకు అప్పులు చేయాల్సిన దుస్థితిలో కూలీలు



పోలింగ్‌కు ముందు ఉపాధి హామీ పనుల్లో కూలీలు

ప్రజాశక్తి-మాచర్ల రూరల్

ఎన్నికలప్పుడు తలెత్తిన ఘర్షణలు పేదల పొట్ట మీద కొడుతున్నాయి. రాజకీయ అల్లర్లను సాకుగా చూపి ఉపాధి హామీ పనులను నిలిపేయడంతో కూలీలు ఇల్లు గడవడం కష్టమవుతోంది. గ్రామీణ పేదలు, కూలీలకు వెన్నుదన్నుగా ఉండేది మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం. గ్రామాల్లో వ్యవసాయ ఆధారిత కుటుంబాలకు ఏడాదికి వంద రోజులు పాటు పని కల్పించడం ద్వారా సామాజిక, ఆహార భద్రతను పెంపొందించడం వంటి సముచిత లక్ష్యాలతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం వామపక్షాల చొరవతో అమలులోకి వచ్చింది. ముఖ్యంగా వేసవిలో రైతులకు, రైతు కూలీలకు పనులు ఉండవు. ఈ సమయంలోనే ఉపాధి పనులు వ్యవసాయ కూలీలకు ఉపాధిపై భరోసా ఏర్పడడమే కాకుండా ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లడం కూడా తగ్గిస్తాయి. ఏటా ఫిబ్రవరి నుంచి జూన్ వరకు ఐదు నెలలపాటు ఉపాధి పనులు ముమ్మరంగా సాగుతాయి. మార్చిలో వ్యవసాయ పనులు ముగిశాక పనులకు వచ్చేవారి సంఖ్య పెరుగుతుంది. ఉపాధి హామీ కింద కందకాలు తవ్వడం, చెరువులు, కాల్వలు, నీటి ఊట ట్యాంకులు, మట్టి

▶ 2లో

24న డిఇఇ సెట్ 2 లో

24న డిఇఇ సెట్

ప్రజాశక్తి-గుంటూరు

డిఇఇ (డిప్లోమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్) సెట్-2024 కంప్యూటర్ ఆధారిత పరీక్షను ఈనెల 24న ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు రూరల్ మండలంలోని చల్లావారిపాలెంలో బాలాజీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో రెండు కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయని, ఈ పరీక్షకు 384 మంది హాజరవుతున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాలకు డిపార్ట్‌మెంట్ అధికారులను నియమించామని, పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల హాల్‌టిక్కెట్‌లో ఏమైనా పొరపాట్లుంటే డిపార్ట్‌మెంట్ అధికారుల ద్వారా సరిచేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ పరీక్షకు సంబంధించిన ఏమైనా సమస్యలుంటే డిఇఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల విభాగం ద్వారా తమ సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు గంట ముందుగా హాజరు కావాలని పేర్కొన్నారు.

పొట్టకొట్టిన గొడవలు

(మొదటి పేజీ తరువాయి)

కట్టలు పూడిక తీత వంటి పనులు చేస్తారు.

మాచర్ల మండలంలో ఈ వేసవిలో ప్రారంభంలో మొదలైన ఉపాధి హామీ పనులు ఈనెల 13 జరిగిన పోలింగ్‌కు ఒక్క రోజు ముందు ఆగిపోయాయి. పోలింగ్ రోజు గ్రామాల్లో అల్లర్లు తలెత్తాయి. తర్వాత రోజుల్లో కూడా అల్లర్లు కొనసాగటంతో ఉపాధి హామీ పనులను అధికారులు నిలిపివేశారు. గ్రామాల్లో కొంత ఉద్రిక్తత వాతావరణం ఉన్న నేపథ్యంలో, వివిధ పార్టీలకు చెందిన గ్రామస్తులు ఒకచోట చేరి పనులు చేసే సమయంలో ఏమైన గొడవులు జరిగే అవకాశం ఉన్నదని, అందువలనే పనులు నిలిపేవామని అధికారులు చెబుతున్నారు. మండలంలో 14,235 జాబ్ కార్డులు ఉండగా, 11,878 యాక్టివ్ జాబ్‌కార్డులు ఉన్నాయి. మొత్తం కూలీలు 20,372 మంది ఉండగా, 10851 మంది మహిళలు, 3021 ఎస్సీలు, 4427 మంది ఎస్టీలు ఉన్నారు. వారం రోజులుగా పనులు లేక పోవటంతో ఈ కుటుంబాలన్నీ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయి. వేసవిలో తమకు ఉపాధి పనులే జీవనాధారమని, ప్రస్తుతం పనులు జరక్కపోవటం వల్ల ఇల్లు గడపడం కోసం అప్పులు చేయాల్సి వస్తోందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలింగ్ సమయంలో గొడవలు జరగని గ్రామాల్లో అయినా పనులు చేయించాలని కోరారు.

పిచ్చికుక్క దాడిలో పలువురికి గాయాలు

ప్రజాశక్తి - అచ్చంపేట



అచ్చంపేట మండల పరిధిలోని గ్రంథసిరిలో మంగళవారం రాత్రి పిచ్చికుక్క దాడిలో పలువురికి గాయాలయ్యాయి. ఎస్సీ, ఎస్టీ కాలనీలో నలుగురు చిన్నారులు మరో నలుగురు వ్యక్తులకు కుక్క దాడితో గాయాల పాలయ్యారు. వారిలో కుంభ ఏడుకొండలు కుమార్తె జ్యోతి అనే చిన్నారికి గాయాలు అవటంతో గుంటూరు తరలించినట్లు తెలిసింది. క్షతగాత్రులను 108 ద్వారా సత్తనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

జానపాడులో కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

మండలంలోని జానపాడులో పిడుగురాళ్ల పట్టణ సిఐ వీరాంజినేయులు ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం కార్డెన్ సెర్చ్ చేశారు. పోలింగ్ రోజున ఈ గ్రామంలో వైసిపి, టిడిపి శ్రేణులు దాడులు చేసుకోగా ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ నేపథ్యంలో గ్రామంలోని ఇళ్ళు, దుకాణాలు, గోదాములను పోలీసులు తనిఖీ చేశారు. ధ్రువపత్రాలు లేని 25 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.



పల్నాడులో జల్లెడ పడుతున్న పోలీసులు

- కౌంటింగ్ తరువాత ఘర్షణల నివారణపై దష్టి
- ఈవీఎం ధ్వంసం కేసులో పిన్నెల్లి వీడియో వెలుగులోకి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

పల్నాడు జిల్లాలోని పలు గ్రామాలను పోలీసులు జల్లెడ పడుతున్నారు. పోలింగ్ రోజున, అనంతరం జరిగిన అల్లర్ల నేపథ్యంలో వచ్చే నెల 4న ఓట్ల లెక్కింపు తరువాత తిరిగి ఘర్షణలు జరిగే అవకాశం లేకుండా పోలీస్ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. పల్నాడు జిల్లా వ్యాప్తంగా కార్డెన్ సెర్చ్ పేరుతో ముమ్మర తనిఖీలు చేస్తున్నారు. ప్రధానంగా మారణాయుధాలు, నాటు బాంబులు, పెట్రోల్ బాంబులు స్వాధీనం చేసుకునేందుకు సోదాలు చేస్తున్నారు. పొలాలు, ఖాళీగా ఉన్న స్థలాలు, గొడ్ల చావిళ్లు, అత్యంత రహస్య ప్రదేశాలను పరిశీలిస్తున్నారు. పల్నాడు జిల్లా మొత్తం తనిఖీలు చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయి. పల్నాడు ఎస్.పి. మలికా గార్గ్ మంగళవారం మాచర్ల ప్రాంతాన్ని సందర్శించారు. మార్చ్ ఫాస్ట్‌లో పాల్గొని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. తరువాత మాచర్ల నియోజకవర్గంలో ఈ నెల 13,14 తేదీల్లో జరిగిన ఘర్షణలపై సమీక్షించారు.

ఘర్షణలకు సంభందించి తదుపరి చర్యలపై అధికారులు ఆచితూచి అడుగులు వేస్తున్నారు. మొత్తం 22 కేసుల్లో 581 మందిని నిందితులుగా ఉన్నట్లు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. వీరిలో 274 మందిని అధికారులు గుర్తించారు. ఇప్పటి వరకూ కేవలం 19 మందిని అరెస్టు చేశారు. 91 మందికి 41ఎ కింద నోటీసులు జారీ చేశారు. ఇంకా 471 మందిని అరెస్టు చేయాల్సి ఉందని ఉన్నతాధికారులకు సిట్ అధికారులు నివేదించారు. వీరిని అరెస్ట్ చేసేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.



మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి రెంటచింతల మండలం పాల్వాయిగేటు వద్ద పోలింగ్ కేంద్రంలో ఈవీఎం ధ్వంసం చేసిన వీడియోలు మంగళవారం సోషల్ మీడియాలో దర్శనమిచ్చాయి. దీంతో పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై ఆధారాలతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసేందుకు సమాయత్తం టిడిపి అవుతుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల ఘర్షణల కేసులో ఆయన్ను అరెస్టు చేస్తారా? లేదా ఈవీఎం ధ్వంసం కేసులో అరెస్ట్ చేస్తారా? అనేది రాజకీయ వర్గాలలో చర్చనీయాంశమైంది. పలు కేసుల్లో టిడిపి, వైసిపి నేతలపై అందిన ఫిర్యాదులను అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నారు. సిట్ ప్రాథమిక నివేదిక ఆధారంగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు త్వరలో అరెస్టుల పర్వం ప్రారంభం అవుతుందని భావిస్తున్నారు. దీంతో ఇప్పటికే పలువురు నేతలు వ్యక్తిగత పనుల పేరుతో జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లినా వారి కదలికలపై నిఘా కొనసాగుతుంది.

లెక్కింపయ్యేదాక సెలవులు అడగొద్దు

- పోలీసులకు పల్నాడు ఎస్పీ ఆదేశం
- కౌంటింగ్ పూర్తయ్యేదాక సిబ్బంది హాలులోనే ఉండాలి
- పల్నాడు కలెక్టర్ శ్రీకేష్ లత్కర్ బాలాజిరావు
- ఈవీఎంలు ఉంచిన స్ట్రాంగ్ రూం భద్రతపై పరిశీలన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ముగిసే వరకూ పోలీసు సిబ్బంది సెలవులు అడగొద్దని, తప్పని పరిస్థితుల్లో మాత్రమే సెలవు తీసుకోవాలని పల్నాడు జిల్లా ఎస్పీ మలికా గార్గ్ చెప్పారు. 4న ఓట్ల లెక్కింపు చేపట్టే జెఎన్‌టియు కాలేజీలోని స్ట్రాంగ్ రూములో భద్రపరిచిన ఈవీఎం వద్ద భద్రతపై జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లత్కర్ బాలాజిరావుతో కలిసి ఎస్పీ మంగళశారం పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ రోజున జిల్లాలో జరిగిన ఘర్షణల్లో పాల్గొన్న నిందితుల కోసం పోలీసు శాఖను సమన్వయం చేసుకుంటూ గాలిస్తున్నామని, వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తామని చెప్పారు. గొడవల్లో పాల్గొనే వారిని గుర్తించి వారినీ బైండోవర్ చేస్తామన్నారు. ఫలితాలు వెలువడిన అనంతరం విజయోత్సవ ర్యాలీలు, బాణాసంచా కాల్చడంపై నిషేధమని స్పష్టం చేశారు. ఓట్ల లెక్కంపులో ఉండే సిబ్బంది ఎవరు కూడా లెక్కింపు ముగిసే వరకు కౌంటింగ్ కేంద్రాన్ని వదిలి వెళ్లకూడదన్నారు. కౌంటింగ్ హాల్లో మైక్రో అబ్జర్వర్లు ఉదయం 6 గంటలకు హాజరు కావాలన్నారు. పోస్టల్ బ్యాలెట్లను మొదటగా లెక్కించాలని, అనంతరం ఈవీఎంలోని ఓట్ల లెక్కింపు చేపట్టాలని చెప్పారు. ఏవైనా సమస్యలు ఎదురైనట్లయితే వెంటనే రిటర్నింగ్ అధికారుల దృష్టికి తేవాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించాలని, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని చెప్పారు. నేర చరిత్ర ఉన్న వారందరర్నీ పోలీస్ స్టేషన్లకు పిలిపించి కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. తీవ్రమైన ఎన్నికల నేరాలకు పాల్పడే వారిని దూరంగా ఉండే స్టేషన్లకు తరలించేందుకు ప్రణాళికలు రూపొందించనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే గుర్తించిన సమస్యాత్మక ప్రాంతాల్లో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా 144 సెక్షన్ అమలు చేస్తామన్నారు. ఈ సెక్షన్ అమలులో ఉన్నప్పుడు ధర్నాలు, రాస్తారోకోలు, ఊరేగింపులు, టపాసులు కాల్చడం, సభలు, సమావేశాలు, ర్యాలీలు పూర్తిగా నిషేధమన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు. ఎలక్షన్ కమిషన్ ద్వారా జారీ చేయబడిన గుర్తింపు కార్డులున్న వారిని మాత్రమే లెక్కింపు కేంద్రంలోకి అనుమతి ఉంటుందన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తాను సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటించడంతో పాటు అక్కడి ప్రజలకు ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పింస్తామని చెప్పారు. ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు ప్రజలు, రాజకీయ పార్టీలు సహకరించాలని, పోలీసులూ నిష్పక్షపాతంగా పని చేయాలని కోరారు.



స్టాంగ్ రూం వద్ద పరిశీలనలో పల్నాడు జిల్లా కలెక్టర్, ఎస్పీ

రైతును చిత్తు చేస్తున్న నకిలీలు

(మొదటి పేజీ తరువాయి)

పురుగుమందులు, ఎరువులను సీజ్ చేశారు. వీటిపై 180కుపైగా కేసులు నమోదవడం నకిలీలు ఏ స్థాయిలో మార్కెట్‌లో చలామణీ అవుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. దుకాణాలతో పాటు రవాణా కార్యాలయాల్లోనూ వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు చేస్తున్నా అక్రమార్కులకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు పంపిణీ చేస్తామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కల్పించడం లేదు. చివరికి అక్రమార్కుల ధనార్జనకు రైతులు బలవుతున్నారు. క్రోసూరు, అచ్చంపేట, రొంపిచర్ల తదితర మండలాల్లో గత సీజన్‌లో రైతులు నకిలీ విత్తనాల ధాటికి చిత్తయ్యారు.

అనుమతులు లేకుంటే సీజ్

ఐ.మురళి, పల్నాడు జిల్లా వ్యవసాయాధికారి



ప్రస్తుతం ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్న నేపథ్యంలో విత్తన, ఎరువుల దుకాణాల్లో తనిఖీలు విస్తృతం చేస్తున్నాం. అనుమతులు లేని ఉత్పత్తులను, నిషేధిత గ్లైసిల్, బిటి పత్తి విత్తనాలను విక్రయిస్తే జరిమానాతో పాటు కేసులు నమోదు చేస్తాం. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు రైతు భరోసా కేంద్రాల్లో పూర్తిస్థాయిలో రైతులకు అవసరం ఉత్పత్తులను అందుబాటులో ఉంచేలా జాగ్రత్తలు పాటిస్తాం. ఈ ఏడాది ఖరీఫ్ రబీలకు కలిపి 3.33 లక్షల హెక్టార్లలో సాగు చేసేందుకు అవసరమైన 3.64 లక్షల మెట్రిక్ టన్నుల విత్తనాలతో పాటు ఎరువుల కొరత ఎదుర్కొనేందుకు 3.43 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను సిద్ధం చేస్తున్నాం. దుకాణాల్లో రైతులకు విత్తనాలను అప్పుగా ఇవ్వడం వల్ల వారు అక్కడే తీసుకుని నకిలీల బారిన పడుతున్నారు. కొనుగోలు సమయంలో రైతులు అప్రమత్తంగా వ్యవహరించాలి. గుర్తింపు పొందిన డీలర్ వద్ద మాత్రమే కొనుగోలు చేయడంతోపాటు రసీదులూ పొందాలి.

ముమ్మరంగా తనిఖీలు - ఎనిమిది వాహనాలు సీజ్


వాహనాల తనిఖీలో సీఐ దశరథ రామయ్య సిబ్బంది

ప్రజాశక్తి - తెనాలి, తెనాలి రూరల్

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ఈనెల 4న జరుగనున్న నేపద్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పట్టణంలో పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. వన్ టౌన్ సిఐ దశరథ రామయ్య సారధ్యంలో మంగళవారం చినరావూరు తోట, వైకుంటపురం కాలువ కట్ట ప్రాంతంలో కవాతు నిర్వహించి వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలంతా సహకరించాల న్నారు. జిల్లా ఎస్పీ, తెనాలి డీఎస్పీ ఆదేశాల మేరకు ప్రశాంత వాతావరణానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నా మన్నారు. కొత్త వ్యక్తులు సంచారాన్ని గుర్తిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. వాహనాల తనిఖీలలో ఎలాంటి పత్రాలు లేని ఎనిమిది వాహాలను సీజ్ చేసినట్లు చెప్పారు. ఆయన వెంట సిబ్బంది, సిఆర్పిఎఫ్ బలగాలు ఉన్నాయి.

ప్రజలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేస్తూ అల్లర్లు, విద్వేషాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని తెనాలి రెండవ పట్టణ సిఐ ఎ సుధాకర్ పేర్కొన్నారు. తెనాలి భాస్కరరావు దిబ్బ, ఐతానగర్ ప్రాంతాల్లో సిఆర్పిఎఫ్ బలగాలతో మంగళవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. జూన్ 4న జరిగే ఓట్లు లెక్కింపు పూర్తయ్యేవరకు ఎన్నికల కమిషన్ రాష్ట్ర వ్యాప్తంగా రెడ్ అలర్ట్ ప్రకటించినట్లు పోలీసులు తెలిపారు. పట్టణ, గ్రామ



పరిధిలో ప్రజలు రాత్రిపూట గుమిగూడి సంచరించరాదన్నారు. పట్టణంలో ఎటువంటి అల్లర్లు జరగకుండా సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు. శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా పోలీసు బందోబస్తు పటిష్టం చేయాలని ఎలక్షన్ కమిషన్ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఫ్లాగ్ మార్చ్ లో ఎస్సై లు, వన్ టౌన్, టు టౌన్ సిబ్బంది పాల్గొన్నారు.

హింసాత్మక ఘటనలకు పాల్పడితే కేసులు నమోదు


ముప్పాళ్ళ మండలం తొండపిలో సోదాలు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

హింసాత్మక సంఘటనలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని సత్తెనపల్లి సర్కిల్ సిఐ ఎమ్ రాంబాబు హెచ్చరించారు. ముప్పాళ్ళ మండలం తొండపి గ్రామంలో పోలీసులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. మే 13 న జరిగిన ఎన్నికల కౌంటింగ్ సమీ పిస్తుండటంతో గ్రామాన్ని పోలీసులు జల్లెడ పట్టారు. అణువణువు గాలించారు. ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గడ్డివాములు , పసువుల కొస్టాలు పాడుబడిన ఇళ్ళల్లో సోదాలు నిర్వహించారు. ఎలాంటి మారణాయుధాలు తదొరకలేదని పోలీసులు తెలిపారు ఈ సందర్భంగా సిఐ రాంబాబు మాట్లాడుతూ గ్రామాల్లో అసాంఘిక సంఘటనలు జరిగితే తక్షణం పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమస్యాత్మక గ్రామాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేశామని గోడల్లో తలదూర్చి జీవితాలను నాశనం చేసుకోవద్దని యువకులకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సందర్భంగా జరిగిన గొడవల్లో అనేక మంది విద్యార్థులు ఉన్నారని వారిమీద కేసులు నమోదు చేస్తామని చెప్పారు. రౌడీషీటర్లు,పాత నేరస్తుల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టామని వివరించారు. అల్లరకు కారకులైన వారిపై రెండు మూడు కేసులు ఉంటే వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు పెడతామని తెలిపారు. క్షణికావేశాలకు లోను కాకుండా ప్రజలు సమన్వయం పాటించాలని కోరారు.



తాళ్లూరులో పోలీసుల తనిఖీలు

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని తాళ్లూరులో మంగళవారం పోలీసులు తనిఖీలు చేశారు. ఈనెల 13వ తేదీన ఆ గ్రామంలో ఎన్నికల సందర్భంగా గొడవలు జరిగాయి. విస్తృత తనిఖీలు చేపట్టినట్లు పెదకూరపాడు ఎస్సై వెంకట్రావు తెలిపారు గ్రామాల్లో గొడవలు పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కూచినపల్లిలో తనిఖీలు

ప్రజాశక్తి-ఈపూరు

సార్వత్రిక ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా గ్రామాలలో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. మండలంలోని ఈపూరు గ్రామపంచాయతీ పరిధిలోని కూచినపల్లి గ్రామంలో మంగళవారం ఎస్సై షేక్ మహమ్మద్ ఫిరోజ్ సిబ్బందితో కలిసి విస్తతంగా తనిఖీలు చేశారు.అనంతరం గొడవలకు పాల్పడితే జరిగే నష్టాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆయనతోపాటు ఏఎస్ఐ సాంబయ్య ఉన్నారు.


ఈపూరులో తనిఖీలు చేస్తున్న పోలీసులు

సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ కవాతు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

రాబోవు 2024 సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ఫలితాల సందర్భంగా మంగళవారం ప్రత్తిపాడు నీయోజక వర్గం కేంద్రం ప్రత్తిపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎమ్ డి. నిసార్ బాషా మరియు ప్రత్తిపాడు ఎస్ ఐ వి సోమేశ్వర రావు ఆధ్వర్యంలో సమస్యాత్మక గ్రామాలలో పోలీస్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగ ఎస్ ఐ మాట్లాడుతూ 4వ తేదీన కౌంటింగ్ జరగుతున్నందున ప్రత్తిపాడు మండలంలో 30 పోలీసు యాక్ట్ మరియు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నట్లు తెలిపారు. అప్పటి వరకు ఎటువంటి సమావేశాలు, ర్యాలీలు నిర్వహించుటకు అనుమతి లేదని, హింసాత్మక సంఘటనలకు పాల్పడితే కఠినంగా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు మానుకొని గ్రామాలలో ప్రతి ఒక్కరు సంయమనం పాటించి, శాంతి భద్రతలను కాపాడుట లో పోలీసు వారికి సహకరించాలన్నారు. ప్రధాన ప్రాంతాలలో అన్నిచోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, ఏమి చేసినా పోలీసు వారికి వెంటనే తెలిసిపోతుందని, కేసుల్లో ఇరుక్కుంటే జీవితాలు అన్యాయంగా నాశనం అవుతాయని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమేశ్వర రావు ప్రత్తిపాడు మండలం లోని చినకొండ్రుపాడు గ్రామములోని గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు.


ప్రత్తిపాడులో పోలీసు కవాతు


చినకోండ్రుపాడులో గ్రామస్తులతో పోలీసుల సమావేశం

కుటుంబ కలహలతోనే దాడి

ప్రజాశక్తి - వినుకొండ :శావల్యాపురం మండలంలోని పోట్లూరు పంచాయతీ శివారు కృష్ణాపురంలో సోమవారం రాత్రి జరిగిన సంఘటనతో పార్టీలకు ఎటువంటి సంబంధం లేదని, రెండు కుటుంబాల మధ్య జరిగిన కలహలతోనే దాడి జరిగిందని రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకర్ బాబు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ గ్రామానికి చెందిన మండల రామకృష్ణ, నాసరమ్మ కుటుంబాల మధ్య వివాదం ఉందని, సోమవారం రాత్రి రామకృష్ణ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించాడనే కారణంతో నాసరమ్మ కుటుంబానికి చెందిన బాలిక క్రికెట్ బ్యాట్తో రామకృష్ణ తలపై దాడి చేసిందని తెలిపారు. నాసరమ్మ, బాలిక, బికారి, నాగుల్ మీరావలి, మీరాబాబు, నాగూర్ పై కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. సమావేశంలో ఎస్సైలు చల్లా సురేష్, చెన్నకేశవులు ఉన్నారు.

బెల్ట్‌షాపుపై దాడి

51,470 నగదు 37 క్వార్టర్ల మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలోని మంచికల్లు గ్రామంలో మద్యం దుకాణం (బెల్ట్ షాపు) పై సోమవారం అర్ధరాత్రి పోలీసులు మెరుపు దాడి చేశారు ఆర్మ డి.ఎస్.పి వెంకటేశ్వరరావు ఎస్సై ఎం ఆంజనేయులు నేతత్వంలో ముప్పేట దాడి చేశారు. ముందుగా అందిన సమాచారం మేరకు పోలీసులు రంగ ప్రవేశం చేయగా సంబంధిత వ్యక్తి పరార్ అవ్వగా అక్కడ వదిలేసిన 51, 470 రూపాయలు నగదు 37 క్వార్టర్లు స్వాధీనం చేసి సీజ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి - దుగ్గిరాల

అధ్వాన్నమైన రోడ్డు మరో నిండు ప్రాణాన్ని బలి తీసుకున్నది. మండలంలోని చింతలపూడి గ్రామ సమీపంలో మంగళవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో తెనాలి సుల్తానాబాద్‌కు చెందిన ఆలేటి జ్యోతి (34) మరణించినది. వేసవి కాలం సెలవులు కావడంతో ఆమె ముగ్గురు ఆడపిల్లలు మంగళగిరి నాయనమ్మ ఇంటికి వెళ్లి ఉన్నారు. పిల్లలను చూసేందుకు భార్య భర్తలు ఇద్దరు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. చింతలపూడి గ్రామ సమీపంలో రోడ్డుపై గుంత ఉండటంతో రామచంద్ర బ్రేక్ వేయడంతో ఆమె ముందుకు పడిపోయింది. దీనితో ఆమె ముఖానికి గాయాలయ్యాయి. తెనాలి 108 వాహనంలో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినది. దుగ్గిరాల ఏఎస్ ఐ అబ్దుల్ సత్తార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలి భర్త రామచంద్ర మూల్పూరు వెటర్నరీ ఆసుపత్రిలో కాంపౌండర్‌గా పనిచేస్తున్నాడు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలం కేసనపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గల ప్రయివేటు పాఠశాలకు వెళ్లే మార్గంలో 40 నుండి 45 ఏళ్ల మధ్య వయసు గల యువకుడి మృతదేహం లభ్యమైనట్లు గ్రామీణ పోలీసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మృతదేహాన్ని నరసరావుపేట ఏరియా ఆస్పత్రి శవా గారానికి తరలించినట్లు తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన వారు నరసరావుపేట గ్రామీణ పోలీసు స్టేషన్ లో లేదా 9440796244 పోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

దొండపాడు పొలంలో మృతదేహం

ప్రజాశక్తి - తుళ్లూరు

మండలంలోని దొండపాడు గ్రామం వద్ద ఉన్న పిచికలపాలెం పొలంలో వేపచెట్టు కింద పురుషుని మృతదేహం ఉండడం కలకలం రేపింది. మంగళవారం ఉదయం పోలీసులకు సమాచారం రావడంతో సిఐ షేక్ సుభాని మృతదేహం ఉన్న ప్రదేశానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతి చెందిన వ్యక్తి అమరావతి మండలం ఎండ్రాయి గ్రామానికి చెందిన వాసిరాజు మధు సూధన్ రాజుగా నిర్ధారణ అయ్యింది. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మృతికి కారణాలు వెల్లడికాలేదు. మృతునికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు, ఒక అబ్బాయి ఉన్నారు. మధుసూధన్ మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమరావతిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ షేక్ సుభాని చెప్పారు



ఈదురు గాలుల బీభత్సం

ప్రజాశక్తి-ఈపూరు

ఈదురుగాలుల బీభత్సానికి మండలంలోని పలు గ్రామాలలో భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. మంగళవారం సాయంత్రం ఈదురు గాలుల ధాటికి చినకొండాయపాలెం పాలెం గ్రామంలో వృక్షాలు నేలకొరిగాయి. ఈ క్రమంలో ఓ ద్విచక్ర వాహనం పై పడటంతో వాహనం ధ్వంసం అయింది. అలాగే విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. భద్రపాలెం గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో చెట్టు ప్రహరీ గోడ, విద్యుత్ తీగలపై పడడంతో అవి ధ్వంసం అయ్యాయి. పలు గ్రామాలు విద్యుత్ సరఫరా లేక అంధకారంలో ఉన్నాయి.

విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించాలి : రైతు సంఘం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో రైతులు సకాలంలో పంటలు సాగు చేసుకునేందుకు అవసరమైన విత్తనాలు, ఎరువులను రాయితీపై అందించాలని, బ్యాంకు రుణాలను త్వరగా అందించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన జారీ చేశారు. ఖరీఫ్ సీజన్లో వ్యవసాయ పనులు ప్రారంభించడానికి రైతులు సిద్ధమవుతున్నారని, వారికి విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సకాలంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించే ఏర్పాటు చేయాలని కోరారు. వ్యవసాయ పనిముట్లనూ రాయితీపై అందించాలని, ఎస్సీ, ఎస్టీ, ఇతర సన్నా, చిన్నకారు రైతులకు ఉచితంగా ఇవ్వాలని కోరారు.

ఎన్నికల విధుల ధ్రువపత్రాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - రెంటచింతల

సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వహించిన టీచర్లు, ఉద్యోగులకు ఎలక్షన్ డ్యూటీ ధ్రువ పత్రాలు వెంటనే అందించాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. పీవోలు, ఏపీవోలు ఈనెల 14 వరకు విధుల్లో ఉన్నారన్నారని, వారికి డ్యూటీ ధ్రువపత్రాలు పిడిఎఫ్ రూపంలో అయినా పంపించాలని కోరారు.

వ్యవసాయ శాఖ ఉద్యోగి లక్ష్మారెడ్డి హఠాన్మరణం

ప్రజాశక్తి - రెంటచింతల

జిల్లాలోనే వివిధ ప్రాంతాల్లో వ్యవసాయ శాఖలో పనిచేసిన గొట్టం లక్ష్మారెడ్డి (47) మంగళవారం వేకువ జామున గుండెపోటుతో మృతి చెందారు. ఈయన 2002 నుంచి ఆ శాఖలో ఎంపీఈవోగా పనిచేస్తున్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత సచివాలయంలో వివిఎ (విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్) బాధ్యతలను చేపట్టి రెంటాలలో పనిచేస్తున్నారు. ఈయనకు భార్య నీలిమ ఇద్దరు సంతానం. కాగా భౌతికకాయాన్ని స్వగ్రామమైన మిట్టగుడిపాడుకు తీసుకెళ్లగా మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి, వివిధ శాఖల అధికారులు సందర్శించి నివాళులర్పించారు.

ఓట్ల లెక్కింపుపై నేడు సమావేశం

ప్రజాశక్తి - పెదకూరపాడు

రాజకీయ పార్టీల సమావేశం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం నిర్వహిస్తామని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి శ్రీరాములు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగో తేదీన చేపట్టే సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపుపై ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

సొలసలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని సొలసలో మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. నరసరావుపేటకు చెందిన శ్రీ దత్త సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో స్థానిక రంగనాయక స్వామి ఆలయం వద్ద 200 మందికి ఈసీజీ, బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.



పథకాల ప్రభావమా? ధరలపై కోపమా?

- ఎన్నికల్లో ఏ అంశం ప్రభావం చూపి ఉంటుంది?
- మహిళల ఓట్లపై అభ్యర్థుల ఆశ - తమకే వేశారని గెలుపుపై ధీమా

ప్రజాశక్తి - చిలకలూరిపేట



ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ అనంతరం విజయావకాశాలపై వివిధ పార్టీల అభ్యర్థులు పెట్టుకున్న ఆశలు ప్రధానంగా మహిళా ఓటర్లపై ఉన్నాయి. ఎక్కువ మంది మహిళలు తమకే ఓటు చేశారని వైసిపి, టిడిపి, కాంగ్రెస్ అభ్యర్థులు ధీమాగా ఉన్నారు. పురుషుల కంటే మహిళలు ఎక్కువగా ఓటు వేయడమూ వీరి ఆశలకు ఒక ప్రాతిపదికగా కనిపిస్తోంది.

నియోజకవర్గంలో 2,26,723 మంది ఓటర్లుండగా వీరిలో పురుషులు 1,08,383 కాగా మహిళలు 1,18,205, ట్రాన్స్ జెండర్స్ 49 మంది. నియోజకవర్గ కేంద్రమైన చిలకలూరిపేట పట్టణంలో 86,840 మంది ఓటర్లుంటే వీరిలో పురుషులు 40,754 మంది, మహిళలు 46,064 మంది, ఇతరులు 22 మంది ఉన్నారు. పట్టణంలోనూ మహిళా ఓటర్లే అధికం. చిలకలూరిపేట మండలం 42,256 మంది ఓటర్లుంటే పురుషులు 20,349, మహిళలు 21,907. నాదెండ్ల మండలంలో 53,169 మంది ఓటర్లుండగా పురుషులు 25,896, మహిళలు 27,246, ఇతరులు 27. యడ్లపాడు మండలంలో 44,981 ఓటర్లుండగా పురుషులు 21,393, మహిళలు 22,968 మంది ఉన్నారు. నియోజకవర్గం మొత్తంగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 2,816 పోలయ్యాయి. మిగతా 85 శాతం పోలింగ్ నమోదవగా పురుషులు 92,765 మంది, మహిళలు 99,858 మంది, ట్రాన్స్‌జెండర్లు 32 మంది ఓటేశారు. ఈ లెక్కన పురుషుల కంటే మహిళలు 7,093 మంది ఎక్కువగా ఓటేశారు. గెలుపోటములను నిర్ణయించే స్థాయిలో మహిళా ఓటర్లు ఉండడంతో వీరి ఓట్లు అధికంగా ఎవరికి పడ్డాయనే ఉత్కంఠ నెలకొంది.

సంక్షేమ పథకాల వల్ల ఎక్కువ లబ్ధిపొందింది మహిళలేనని, వారిఓట్లు తమకేనని వైసిపి అభ్యర్థి కావటి శివనాగమనోహర్ నాయుడు ధీమాగా ఉన్నారు. అయితే నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, మద్యం, ఇతర ప్రజావ్యతిరేక చర్యలుకు పాల్పడిన వైసిపి ప్రభుత్వ తీరుతో ఎక్కువ మంది మహిళలు ఈసారి తమవైపు మొగ్గారని ఎన్‌డిఎ కూటమి తరుపున టిడిపి అభ్యర్థి పత్తిపాటి పుల్లారావు విశ్వాసంగా ఉన్నారు. పింఛను రూ.4 వేలకు పెంచుతామే హామీపట్లా ఎక్కువ మంది మహిళలు టిడిపికి అనుకూలంగా ఓటేస్తారని చెబుతున్నారు. అయితే ఎవరూ అంచనా వేయని విధంగా నిశ్శబ్ధ ఓటింగ్ జరిగిందని, వైసిపి, టిడిపి తీరు కారణంగా ఎక్కువ మంది మహిళలకు తమకు ఓటేశారని ఇండియా వేదిక తరుపున కాంగ్రెస్ అభ్యర్థి ఎం.రాధాకృష్ణ అంటున్నారు.

24 నుండి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు

నిర్వహణపై జెసి సమీక్ష - పకడ్బందీ చర్యలకు ఆదేశం

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ఈనెల 24 నుండి జూన్ 3 వరకు నిర్వహించనున్న పదవ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులను పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ ఆదేశించారు. ఈ మేరకు పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. 10వ తరగతి, సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించే 10వ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహణపై సమీక్షించారు. పదవ తరగతి పరీక్షలకు రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు 6,199 మంది హాజరవుతుండగా వీరికి 23 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ జరుగుతాయన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద నిరంతర విద్యుత్ ఉండేలా చూడాలని అన్నారు. సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించే పరీక్షలకు సంబంధించి 10వ తరగతిలో 938 మంది, ఇంటర్మీడియట్ 1,272 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. వీరికి మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5.39 గంటల వరకూ పరీక్ష ఉంటుందన్నారు.పరీక్షా కేంద్రాలకు వెళ్లే విధంగా బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి నేపథ్యంలో ఊరేగింపులు, బహిరంగ సభలు వల్ల విద్యార్థులకు అవాంతరాలు ఏర్పడకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ప్రథమ చికిత్స కేంద్రాలు, తాగునీటి వసతిని ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షల అనంతరం పరీక్ష పత్రాలను పకడ్బందీగా సంబంధిత కేంద్రాలకు చేర్చాలన్నారు. పరీక్షా కేంద్రాల పరిసరాలు వద్ద 144 సెక్షన్ అమలయ్యేలా చూడాలన్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి సమస్యల పరిష్కారానికి 9963192487 నంబర్‌కు ఫోన్ చేసి పరిష్కారం పొందాలని సూచించారు. సమీక్షలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.







అల్లర్ల అణచివేతపై పోలీసుల మాబ్ ఆపరేషన్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రజలను రెచ్చగొట్టి, అల్లర్లు సృష్టించి, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అరాచక శక్తులను పోలీసులు ఎలా ఎదుర్కొంటారో మాక్ డ్రిల్ ద్వారా పల్నాడు జిల్లా పోలీసులు ప్రజలకు వివరించారు. 4న ఓట్ల లెక్కింపు నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు చేపడుతున్న చర్యలపై ఎఆర్ అడిషనల్ ఎస్పీ రామచంద్రరాజు ఆధ్వర్యంలో ఆర్మ్‌డ్ రిజర్వు పోలీస్ సిబ్బందితో పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని పల్నాడు బస్టాండ్ వద్ద మంగళవారం 'మాబ్ ఆపరేషన్' మాక్ డ్రిల్ నిర్వహించారు. ఎఎస్పీ ఆర్.రాఘవేంద్ర మాట్లాడుతూ ఏదైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినా, హింసాత్మక చర్యలకు పాల్పడినా, ఎవరైనా అల్లర్లు చేస్తున్న సమయాల్లో స్పందించాల్సిన తీరును వివరించారు. జన సమూహాలను చెదరగొట్టేందుకు మొదటి హెచ్చరిక చేయడం, అప్పటికీ అదుపుకాకుంటే మెజిస్ట్రేట్ అనుమతితో టియర్ గ్యాస్ ప్రయోగించటం, ఉద్రిక్త పరిస్థితుల్లో తనను తాను రక్షించుకుంటూ లాఠీఛార్జి, ఆ తర్వాత ఫైర్ డిపార్ట్మెంట్ వారితో వాటర్ కెనాన్ ప్రయోగించటం, ప్లాస్టిక్ పెల్లెట్స్ ఫైరింగ్, అప్పటికి పరిస్థితి అదుపులోకి రాకుంటే ఫైరింగ్ వంటి కార్యక్రమాలపై డెమో ద్వారా ప్రదర్శించారు. శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తూ విధ్వంసానికి ప్రయత్నించే అల్లరిమూకలను అణచి వేసేందుకు, అత్యవసర సమయంలో పరిస్థితిని అదుపులోకి తీసుకొని వచ్చేలా ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని చెప్పారు. జిల్లాలో ఎక్కువ సంఖ్యలో కేంద్ర సాయుధ బలగాలు, ప్రత్యేకంగా రాపిడ్ యాక్షన్ ఫోర్స్‌లు అందుబాటులో వున్నాయన్నారు. ప్రశాంత వాతావరణం నెలకొల్పడంతోపాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపట్ల చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో టూటౌన్ సీఐ భాస్కర్, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సాగుప్రారంభం నాటికి కాల్వల మరమ్మతులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - తాడేపల్లి

ఈ ఖరీఫ్ సీజన్‌లో కాల్వలు మరమ్మతులు చేపట్టి రైతులను ఆదుకోవాలని సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు డిమాండ్ చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమతున్నా, తెనాలి డెల్టా ఏరియా కాల్వల మరమ్మతులు, షట్టర్స్ రిపేర్లు వెంటనే చేయించాలని అన్నారు. మంగళగవారం తాడేపల్లి పట్టణంలోని మేకా అమరారెడ్డి భవన్‌లో మంగళగిరి నియోజకవర్గ విస్తృత సమావేశం బూరుగ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ తెనాలి డెల్టా పరిధిలో 5.71 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నట్లు తెలిపారు. డెల్టా పరిధిలో 5.71 లక్షల ఎకరాల సాగు భూమి ఉందని గుర్తు చేశారు. నిజాంపట్నం, కొమ్మమూరు, కెడబ్ల్యూడి బ్యాంకు కెనాల్ తదితర ప్రధాన కాల్వలు, ఉప కాల్వలు 40కు పైగా ఉన్నాయని చెప్పారు. రైతులకు పంటలు సమృద్ధిగా పండటానికి నీరు సరఫరా చేసే కాల్వలకు రూపాయి ఖర్చు చేసి మరమ్మతులను చేయించకపోవడం రైతుల పట్ల ప్రభుత్వా లకున్న నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. గుంటూరు ఛానల్ మరమ్మతులను తక్షణం పూర్తి చేయాలన్నారు. సమావేశంలో సాగునీరు, తాగునీరు విడుదల చేయాల్సిన సమయమూ ఆసన్న మైనా కాల్వలు మాత్రం పూడికతీతకూ నోచుకోలేదని అన్నారు. హెడ్ రెగ్యులేటర్ లీకులు రిపేర్లకు పూనుకోవా లన్నారు. పెదవడ్లపూడి హైలెవల్ ఛానల్‌కు నిధులు కేటాయించి ఖరీఫ్ నాటికి నీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. చిన్న కాల్వల్లోని పూడికతీత, తూటికాడ, గుర్రపుడెక్క తొలగించాలని కోరారు. మోరంపూడి ప్రధాన కాల్వ గోడలను మరమ్మతులు చేయా లన్నారు. పొన్నూరు, చేబ్రోలు, పెదకాకాని ఏరియాల్లోని సాగునీటి కాల్వల్లోనూ పూడికతీత పనులు చేయాలని కోరారు. ఈ ప్రాంతంలో పంటలను కాపాడుకోవడానికి రైతులు ఆయిల్ ఇంజిన్ల ద్వారా ఎకరాకు రూ.5 వేలు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోందని తెలిపారు. కొండవీటి వాగులో పెద్దఎత్తున పేరుక పోయిన తూటికాడ, గుర్రపుడెక్కను తొలగిం చాలని డిమాండ్ చేశారు. ఆకు కూరల మడులకు నీరందిం చాలని కోరారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం రవి, ఈమని అప్పారావు, ఎస్ఎస్ చంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, భీమిరెడ్డి కోటేశ్వరి, నాయకులు వై. కమలాకరరావు, జెట్టి బాలరాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు

ఓట్ల లెక్కింపునకు పటిష్టబందోబస్తు ఏర్పాటు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు

సిపిఎం గుంటూరు జిల్లా కార్యాదర్శి పాశం రామారావు మాట్లాడుతు 4వ తేదీన నిర్వహించే కౌంటింగ్ కేంద్రాల్లో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, ఎజంట్లకు, సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని వసతులు కల్పించాలని ఆయన తెలిపారు. జిల్లాలో అనేక చోట్ల మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని, ఈ సమస్యను తక్షణమే అధికారులు పరిష్కరించా లన్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభం అవుతుందని, అన్నిరకాల విత్తనాలు, ఎరువులు ఆర్‌బికెల్లో రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. మంగళగరి నియోజవర్గంలో ప్రభుత్వ భూముల్లో ఇళ్లు వేసుకుని దీర్ఘకాలంగా నివాసముంటున్న పేదలకు ఇళ్లపట్టాలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు.

డాక్టర్ ప్రజ్ఞాచారికి అన్నమయ్య పురస్కారం

ప్రజాశక్తి తెనాలి



సాహితీ రత్న డాక్టర్ నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారికి అన్నమయ్య పురస్కారం లభించింది. చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి మండలం గొల్లచీమన గ్రామానికి చెందిన ఆంధ్ర కళల పరిరక్షణ సమితి, ఏ. ఎస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో వివిధ రంగాలలో సేవలందించిన పలువురికి 26వ తేదీన అన్నమయ్య పురస్కారాలు ప్రదానం చేయనున్నారు. ఈ నేపద్యంలో సాహితీ రంగంలో సేవలు అందించిన తెనాలి రూరల్ గ్రామం కొలకలూరు కు చెందిన పూర్ణ ప్రజ్ఞాచారిని కూడా అన్నమయ్య పురస్కారానికి ఎంపిక చేసినట్లు సంస్థ అధ్యక్షులు ఎం చిరంజీవి నుంచి ఆహ్వానం అందుకున్నట్లు ప్రజ్ఞాచారి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రజ్ఞాచారి మాట్లాడుతూ ప్రఖ్యాత వాగ్గేయ కారుడు అన్నమయ్య పురస్కారం అందుకోవటం సంతోషంగా ఉందన్నారు. పురస్కారానికి ఎంపికైన ప్రజ్ఞాచారిని పలువురు ప్రముఖులు అభినందించారు.



ఆదినారాయణ ను సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ బృందం

పౌరాణిక నటుడు డాక్టర్ ఆదినారాయణకు సత్కారం

ప్రజాశక్తి తెనాలి

పట్టణానికి చెందిన ప్రముఖ రంగస్థల పౌరాణిక నటులు డాక్టర్ ఆరాధ్యుల ఆదినారాయణను వీరబ్రహ్మేంద్ర స్వామి జయంతి ఉత్సవాలలో సత్కరించారు. రూరల్ గ్రామం కఠెవరంలో సోమవారం రాత్రి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వీరబ్రహ్మేంద్ర జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరవ డాక్టరేట్ అందుకున్న ఆరాధ్యుల ఆదినారాయణను సత్కరించారు. గ్రామానికి చెందిన తాడిబోయిన నాగేశ్వరరావును పౌరాణిక నాటక రంగంలో భవాని శంకర్ పాత్రకు తీర్చిదిద్దిన ఆదినారాయణకు ప్రత్యేకంగా బంగారు ఉంగరాన్ని బహూకరించారు. డాక్టర్ పాతూరి సుబ్రహ్మణ్యం రాసిన సన్మాన పత్రం అందించారు. కార్యక్రమంలో డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, నటులు ఫణి కుమార్, కుమార్ బాబు, రామలింగేశ్వరరావు, సంగమేశ్వర వేంకటేశ్వరరావు, గంపల శివనాగేశ్వరరావు, దూళ్ళ అప్పయ్య, సూర్యం, వందనం పాల్గొన్నారు.





మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, హాజరైన విద్యార్థులు

ప్రణాళికతో సివిల్స్ కల సాకారం

శాసనమండలి సభ్యులు కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-గుంటూరు

దేశ పాలనా రంగంలో రాజకీయ వ్యవస్థలకి భిన్నంగా ప్రజలకు సేవచేసే అవకాశం ఇండియన్ సివిల్ సర్వీసెస్ ఉద్యోగాల ద్వారా ఖ్యాతి, దేశానికి సేవ చేసే అవకాశాలు ఉంటాయని శాసనమండలి సభ్యులు కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు కె.వి.ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు 10 రోజుల ఐఏఎస్ ఫౌండేషన్ అవగాహన తరగతులు స్థానిక బ్రాడీపేట యుటిఎఫ్ సమావేశ మందిరంలో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ భిన్న సంస్కృతులు, ఆర్థిక సామాజిక అసమానతలను తగ్గించేందుకు అధికారులుగా ఐఏఎస్‌లకు తమ పాలన ద్వారా ప్రత్యేక పాత్ర ఉంటుందన్నారు. ఒక జిల్లా కలెక్టర్ తన పాలనలో ఆ జిల్లా రూపురేఖలను మార్చే అవకాశం ఉంటుందని తెలిపారు. రాజకీయ అధికారాలు కేవలం ఐదు సంవత్సరాలు మాత్రమే ఉంటాయని సివిల్ సర్వెంట్స్ మూడు దశాబ్దాలకు పైగా దేశ సేవలో పని చేసే అవకాశం రాజ్యాంగం కల్పిస్తున్నదని తెలియజేశారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే సర్వీస్ కమిషన్ రాష్ట్ర అధికారులుగా పనిచేస్తారని జాతీయ స్థాయిలో సివిల్ సర్వీస్ కమిషన్ ద్వారా జాతీయస్థాయిలో దేశ విదేశాలలో సేవ చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. సన్ ఆర్గనైజేషన్ కోఆర్డినేటర్స్ ఆశిష్, హరీష్, సంధ్య మాట్లాడుతూ గత దశాబ్ద కాలంగా ఎమ్మెల్సీ లక్ష్మణరావు సహకారంతో సన్ ఆర్గనైజేషన్ విద్యార్థుల చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.కార్యక్రమంలో డాక్టర్ జన విజ్ఞాన నాయకులు సత్యనారాయణ ప్రసాద్, టి ఆర్ రమేష్, సుబ్బారాయుడు, అధిక సంఖ్యలో విద్యార్థిని, విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



నాగులపాడులో సుబ్రమణ్య స్వామి వారికి అభిషేకం సాంబశివరావు తదితరులు

ఘనంగా సుబ్రహ్మణ్యస్వామి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

నాగులపాడులో వేంచేసియున్న శ్రీ శంగేరి శారదా పీఠ పాలిత స్వయంభు శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి 46వ వార్షిక బ్రహ్మోత్సవా లు ఈనెల 17 నుండి గోవు పూజతో ప్రారంభమైనాయి. సోమవారం రాత్రి జరిగిన మల్లెపూల పూజలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మంగళవారం స్వామివారికి విశేష అభిషేకాలు పూజా కార్యక్రమాలు ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు గొల్లపూడి సాంబశివరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లోఉపాధ్యక్షులు పాటిబండ్ల సుబ్బారావు, సెక్రటరీ ఆళ్ల విజయ్ కుమార్, ట్రెజరరీ దాసరి సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ నంగినేని సింగారావు, సలహా మండల సభ్యులు నర్రా బాలకృష్ణ, కమిటీ సభ్యులు కారుమంచి సాంబశివరావు, కన్నెగంటి చలమయ్య, కాపు సుబ్బారావు పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు పాల్గొన్నారు.


నెహ్రూ నికేతన్‌కు జాతీయస్థాయి ఉత్తమ పాఠశాల పురస్కారం

ప్రజాశక్తి -తెనాలి

సుదీర్ఘ కాలంగా ప్రణాళికా బద్ధమైన విద్యనందిస్తూ, స్వర్ణోత్సవ వేడుకలు జరుపుకున్న స్థానిక బోస్ రోడ్డు లోని నెహ్రూ నికేతన్ పాఠశాలకు లీడ్ స్కూల్ జాతీయస్థాయిలో ఏడవ ఉత్తమ పాఠశాల శిక్షా పురస్కారాన్ని ప్రకటించింది. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో డైరెక్టర్ మురళీకాంత్ దాసరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గీతకాంత్ దాసరి వివరాలను వెల్లడించారు. వారు మాట్లాడుతూ దేశంలో లీడ్ స్కూల్ కరికులమ్ అమలు చేస్తున్న మూడువేల పాఠశాలలలో నెహ్రూ నికేతన్ ఒకటన్నారు. ఇందులో ప్రధానంగా లీడ్ స్కూల్ వారి ఆధునిక ప్లేవే మెథడ్స్ విద్యార్థులలో చదువుపై ఆసక్తిని రేకెత్తిస్తున్నాయన్నారు. దశ్య శ్రవణ మాధ్యమాల ద్వారా యాక్టివిటీ బేస్డ్ ఎడ్యుకేషన్ను నెహ్రూ నికేతన్ అందిస్తుందన్నారు. చిన్నారుల కలల ప్రపంచం గా నెహ్రూనికేతన్ ప్లే స్కూల్ విలసిల్లుతుందన్నారు. అంతేకాకుండా లిటిల్ స్కాలర్స్ ప్రోగ్రాం ద్వారా విద్యార్థులు నేర్చుకున్న పాఠ్యాంశాలను నిర్భయంగా వ్యక్తీకరించటం, ప్రదర్శనల ద్వారా వారి సామర్థ్యాలను బహిర్గతం చేయటం వంటి కత్యాలను పరిశీలించిన లీడ్ స్కూల్, పాఠశాలకు జాతీయ ఉత్తమ పాఠశాలల్లో 7వ స్థానం కల్పించిందని, ఈ మేరకు లీడ్ స్కూల్ వ్యవస్థాపకులు, సీఈవో సుమిత్ మెహతా, కో-సిఈఒ సుమిత్ దేవ్రాహ్ వెల్లడించారన్నారు. జూన్ నెలలో న్యూఢిల్లీలో లీడ్ స్కూల్ నిర్వహించే కార్యక్రమంలో జాతీయ ఉత్తమ పాఠశాల పురస్కారాన్ని ప్రధానం చేయనున్నారని వారు తెలిపారు. విద్యా వ్యవస్థలో 50ఏళ్ళ సుదీర్ఘ ప్రయాణంలో పాఠశాలకు లభించిన గుర్తింపు పై హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల ఉపాధ్యాయ బందానికి, అనుక్షణం వెన్నంటే నడిపిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులకు వారు కతజ్ఞతలు తెలిపారు.



.వివరాలు వెల్లడిస్తున్న మురళి కాంత్, గీతా కాంత్



సాంకేతిక విప్లవానికి రాజీవ్ గాంధీ నాంది

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

దేశంలో సాంకేతిక విప్లవానికి నాంది పలికింది రాజీవ్ గాంధీయేనని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు డి.జ్ఞాన్‌రాజ్‌పాల్ అన్నారు. సత్తెనపల్లిలోని ఆ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 34వ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. పిసిసి కార్యదర్శి ఎం.వేదాద్రి, నాయకులు ఎస్.మోహన్రావు, కె.ఆనంద్, ఎం.శంకర్, షేక్ చాంద్‌బాషా, జి.వెంకటేశ్వర్లు, అబ్రహం, వెంకటేశ్వర్లు, కె.లక్ష్మయ్య, జె.శేఖర్, ఎం.శంకర్ పాల్గొన్నారు.



ప్రజాశక్తి - చిలకలూరిపేట

స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు ఎం.ప్రసన్న అధ్యక్షతన రాజీవ్ గాంధీ వర్ధంతి సభ నిర్వహించారు. చిత్రపటానికి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బి.రామకోటేశ్వరరావు పూలమాలలేశారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎం.రాధాకృష్ణ మాట్లాడుతూ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించే ఉద్దేశంతో శ్యాంపిట్రోడా అనే శాస్త్ర సాంకేతిక నిపుణుణ్ణి ఇటలీ నుంచి రప్పించి దేశంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగానికి రాజీవ్ గాంధీ శ్రీకారం చుట్టారన్నారు. జవహర్ రోజ్‌గార్ యోజన పథకం ద్వారా ప్రతి పల్లెకు నేరుగా నిధులు అందించి గ్రామీణాభివృద్ధికి బాటలేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎన్.వెంకటేష్, ఎం.శ్రీనివాసరావు, భవాని, బాషా, మస్తాన్‌వలి పాల్గొన్నారు.

ఘనంగా యాదాద్రి నరసింహస్వామి కళ్యాణమహోత్సవం

ప్రజాశక్తి - గురజాల



మండలంలోని జంగ మహేశ్వరపురంలో ఉన్న యాదాద్రి నరసింహస్వామి కళ్యాణ వార్షిక మహోత్సవాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 15 వేల మందికి పైగా అన్నదానం ఏర్పాటు చేశారు.

బెజగం రవికుమార్‌కు జ్ఞానబుద్ధ పురస్కారం



ప్రజాశక్తి - సత్తెనపల్లి : తెలుగు వెలుగు సాహితీ వేదిక గ్రేటర్ వరంగల్ వారిచే ప్రకాశం జిల్లా ఒంగోలులో ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, ఒరిస్సా, మహారాష్ట్రాలకు చెందిన పలువురికి ఇటీవల పురస్కారాలను అందించారు. విద్య, సమాజ సేవ, వైద్యం, కోలాటం, భజన, రంగస్థలం పౌరాణిక కళా సేవా రంగాల్లో దాదాపు 150 మందికి జ్ఞానబుద్ధ, మయూరి, నంది పురస్కారాలను ప్రదానం చేశారు. ఇందులో సత్తెనపల్లికి చెందిన పౌరాణిక కళాకారులు బెజగం రవికుమార్‌కు జ్ఞానబుద్ధ పురస్కారాన్ని అందించి సత్కరించారు. ఎనిమిదేళ్లుగా విభిన్న పౌరాణిక పాత్రాలను ధరించి రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రేక్షకులను రంజింప చేసినందుకు అవార్డును ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఇసుక రీచ్‌లో సిసి కెమెరాలు

- **యంత్రాలతో తవ్వకాలు నిషేధం**
- **పల్నాడు జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లత్కర్**
- **పలు ఇసుక రీచ్‌లలో పరిశీలన**



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

అమరావతి మండల పరిధిలో మల్లాది, దిడుగు, అచ్చంపేట మండలం కోసూరులోని ఇసుక రీచ్‌లను పల్నాడు జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లత్కర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో 5 డిసిల్టింగ్ పాయింట్‌లకు గాను జెసికేసి అనే ఏజెన్సీని గుర్తించినట్లు చెప్పారు. పరిమితులు లేని కారణంగా ఇసుక తవ్వకాలు జరగడం లేదన్నారు. నిబంధనల మేరకు తగిన రుసుం చెల్లించి అనుమతులు వచ్చాకే ఇసుక రీచ్లలో యంత్రాల్లేకుండా ఇసుక తవ్వకాలు చేసుకోవచ్చని చెప్పారు. ఈ ప్రక్రియ అంతా నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలకు లోబడి జరగాలన్నారు. ఇసుక రీచ్ పాయింట్లు వద్ద సీసీ కెమెరాలు అమర్చామని, రెవెన్యూ, పోలీస్, స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరోలతో ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేయాలని సూచించారు. యంత్రాలతో ఇసుకను తవ్వినా, అక్రమంగా రవాణా చేసినా గమనించిన వారు సంబంధిత అధికారులు దృష్టికి తేవాలని సూచించారు. ఇసుక రీచ్‌లు వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. పరిశీలనలో ఆర్‌డిఒ మురళీకృష్ణ, భూగర్భ గనుల శాఖ అధికారి నాగిని, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏఈఈ సుధా, తహశీల్దార్ పాల్గొన్నారు.

ఇసుక తవ్వితే చెప్పండి

అక్రమ త్వకాలు, రవాణా నియంత్రణపై పల్నాడు జెసి సమీక్ష

సుప్రీం కోర్టు ఆదేశాల నేపథ్యంలో పల్నాడు జిల్లాలో ఇసుక అక్రమ రవాణా జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో జెసి ఎ.శ్యాంప్రసాద్ మంగళవారం సమీక్షించారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలు జెసి మాట్లాడుతూ నాలుగు రోజులు నుండి జిల్లాస్థాయి ఇసుక కమిటీ సభ్యులు జిల్లాలోని పలు ఇసుక రీచ్‌లలో తనిఖీలు చేశారని, రీచ్‌లో ప్రస్తుతం ఇసుక తవ్వకాలు, రవాణా జరగడం లేదని చెప్పారు. కమిటీకి చైర్మన్ అయిన జిల్లా కలెక్టర్ కూడా రీచ్‌లలో పర్యటించి తవ్వకాలు నిలిపేలా ఆదేశాలు జారీ చేశారన్నారు. జిల్లాలోని గిడుగు, పొందుగల, కోనూరు ఇసుక రీచ్ తనిఖీ చేసి అక్కడ తవ్వకాలు జరగటంలేదని కలెక్టర్ గుర్తించారన్నారు. రీచ్‌కు వెళ్లే మార్గాల్లో గుంతలు తీసి వాహన రాకపోలకు వీల్లేకుండా చేయాలని, దీనిపై గ్రామాల్లోనూ దండోరా ద్వారా సమాచారం ఇవ్వాలని చెప్పారు. ఇసుక అక్రమ తవ్వకాలు చేపడితే టోల్ ఫ్రీ నెంబర్ 1800599459కు, dmgopalnadu sand complaints eyahoo.com కు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాచారం అందుకున్న అనంతరం జిల్లా, మండల స్థాయి టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అప్రమత్తమై అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకుంటారని చెప్పారు. సమీక్షలో ఎస్ఇబి అధికారులు, పోలీస్, రెవెన్యూ, మైనింగ్ అధికారులు సభ్యులుగా ఉంటారని తెలిపారు.



సమీక్షలో మాట్లాడుతున్న జెసి శ్యాంప్రసాద్

నిందితుల అరెస్టులో పక్షపాతం వద్దు : శ్రీధర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పల్నాడు జిల్లాలో టిడిపి శ్రేణులపై వైసిపి నాయకులు దాడులకు పాల్పడ్డారన్నారని టిడిపి పల్నాడు జిల్లా కార్యదర్శి కె.శ్రీధర్ ఆరోపించారు. మరోవైపు టిడిపి కార్యకర్తలపై అధికార పార్టీకి కొమ్ముకాసే పోలీస్ అధికారులు అక్రమ కేసులు బనాయించి, ఘర్షణలకు సంబంధం లేని వారిని కేసులో ఇరికిస్తున్నారని విమర్శించారు. ఈ మేరకు పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని టిడిపి జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల వివాదాల్లో పాల్గొన్న వారిని నిష్పక్షపాతంగా అదుపులోకి తీసుకుని విచారణ జరిపించాలని కోరారు. దాడులకు పాల్పడిన వైసిపి నాయకులను అరెస్ట్ చేయకుండా పోలీసులు పక్షపాతం చూపిస్తున్నారని అన్నారు. టిడిపికి చెందినవ ఆరి వాహనాలు, ఆస్తులను వైసిపి శ్రేణులు ధ్వంసం చేస్తున్నాయని, వాహనాలకు నిప్పు పెడుతున్నారని విమర్శించారు. వైసిపి శ్రేణుల దాడిలో గాయపడిన టిడిపి సానుభూతిపరులు పోలీసులు ఫిర్యాదు చేస్తున్నా తీసుకోవడం లేదన్నారు. జిల్లాలో ప్రశాంత వాతావరణం నెలకొనాలంటే పోలీసులు పక్షపాతం లేకుండా వ్యవహరించాలని కోరారు.



కొల్లి నాగేశ్వరరావుకు నివాళులు

ప్రజాశక్తి - వినుకొండ

రైతు ఉద్యమ నేత కొల్లి నాగేశ్వరరావు నాలుగో వర్ధంతి స్థానిక సిపిఐ కార్యాలయంలో మంగళవారం జరిగింది. రైతు సంఘం నాయకులు రాము మాట్లాడుతూ నాగేశ్వరరావు జీవితమంతా రైతు సమస్యలను పరిష్కారం కోసం ఉద్యమించారని చెప్పారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కోసం ఆయన పోరాటం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో పి.వెంకటేశ్వర్లు, మల్లికార్జునరావు, టి.నరసింహారావు, వెంకటేశ్వర్లు రంగబాబు, దావీదు, మస్తాన్ పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణపై సమావేశం

ప్రజాశక్తి - వినుకొండ

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. దీనిలో భాగంగా మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి అధ్యక్షతన పోలీస్ అధికారులు సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సుబ్బారావు మాట్లాడుతూ శాంతిభద్రతలను కాపాడాలన్నారు. ఎటువంటి కఠిన పరిస్థితులైన ఎదుర్కొనేందుకు పోలీసులు సిద్ధంగా ఉన్నట్లు వినుకొండ పట్టణ, రూరల్ సిఐలు సాంబశివరావు, సుధాకర్ చెప్పారు. ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు.



సమీక్షలో ఆర్‌వో, పోలీసు అధికారులు

ఆ మార్గంలో ప్రయాణం.. దుర్వాసనతో సహవాసం..

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పట్టణంలోని నీళ్ల ట్యాంకుల దగ్గర నుంచి టిడ్కో ఇళ్లకు వెళ్లే మార్గంలో రోడు వెంట చెద్దాచెదారం, ఇతర వ్యర్థాలతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. టిడ్కో ఇళ్లతోపాటు సింగ్ నగర్, మదర్ థెరిస్సా కాలనిలకు రాకపోకలు ఈ మార్గంలోనే జరుగుతాయి. పలువురు ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ కూడా చేస్తుంటారు. ఈ క్రమంలో గాలికి ప్లాస్టిక్ కవర్లు, ఇతర పేపరు ముక్కలు గాలికి వచ్చి పైన పడుతుండడంతో రాకపోకలకు అసౌకర్యంగా ఉంది. డంపింగ్ యార్డుకు చేరాల్సిన చెత్తంతా రోడ్డు పక్కనే పడేస్తున్నారని, చనిపోయిన జంతువులనూ పడేస్తుండడంతో దుర్వాసనను భరించలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు. మున్సిపల్ అధికారులు సత్వరం స్పందించి సమస్యను పరిష్కరించడంతోపాటు వీధిలైట్లు కూడా సాయంత్రం 6 గంటలకల్లా ఆన్ చేయించాలని కోరుతున్నారు.



న్యాయమూర్తులకు ముగిసిన శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

సుప్రీమ్ కోర్టు మీడియేషన్, కన్సిలియేషన్ ప్రాజెక్ట్ కమిటీ, న్యూఢిల్లీ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ , అమరావతి ఆదేశాల మేరకు గుంటూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు వారు ఎంపిక చేసిన న్యాయాధికారులకు మధ్యవర్తిత్వంపై నలభై గంటల శిక్షణలో భాగంగా రెండో రోజైన మంగళవారం రాష్ట్ర న్యాయ సేవాధికర సంస్థ సభ్య కార్యదర్శి ఎం.బబిత, రాష్ట్ర న్యాయ సేవాధికర సంస్థ పాలనాధికారి ఏ.అమరరంగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బబిత మాట్లాడుతూ మాట్లాడుతూ మధ్యవర్తిత్వం అనేది వివాద పరిష్కారానికి ప్రత్యామ్నాయం అని, ఇరు పక్షాలు మధ్యవర్తి (తటస్థ వ్యక్తి) సహాయంతో వివాదములను చర్చించుకొని ఒక ఆమోదయోగ్యమైన తీర్మానమునకు రావొచ్చునని తెలిపారు. దీని మీద శిక్షణ తీసుకోవడం ద్వారా భవిష్యత్తులో కేసుల పరిష్కారానికి ఈ శిక్షణా తరగతులు ఉపయోగపడుతాయని తెలియచేసారు. ఈ శిక్షణ తరగతులు న్యాయమూర్తులకు మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారానికి దోహదపడుతుందని తెలిపారు. కక్షిదరులకు మధ్యవర్తిత్వం గురించి వివరించి వారి అహాన్ని పక్కనుంచి కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకొని వారి సమయమును , ధనమును ఆదా చేసుకోవచని తెలిపి కేసుల పరిష్కారానికి కషి చేయాలని తెలిపారు . మధ్యవర్తిత్వం ద్వారా మానవ సంబంధాలని నిలుపుకోవచ్చని తెలిపారు.



మాట్లాడుతున్న బబిత తదితరులు

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు

ప్రభుత్వ ప్రాంతీయ గ్రంధాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం పిల్లలకు ఉపాధ్యాయురాలు ఎన్.ధనమ్మ పాఠాలు బోధించారు. దేశ అభివృద్ధిని ఆకాంక్షించి, ఆబాటలో నడవటం మానవత్వాన్ని కలిగి ఉండటం మన కర్తవ్యంగా భావించి, ప్రవర్తించాలని చెప్పారు. అలాగే సమయం వృధా చేయకుండా జ్ఞానాన్ని సంపాదిస్తూ, ఆ జ్ఞానాన్ని అందరికీ పంచుతూ సంతృప్తిగా జీవించటం మన జీవిత లక్ష్యమని చెప్పారు. కార్యక్రమంలో గ్రంధాలయాధికారి ఎన్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ధనమ్మ

కవ్వింపు చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు : ఎస్ఐ

ప్రజాశక్తి దుగ్గిరాల

ఎన్నికల ఫలితాలు వచ్చిన రోజున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడ వద్దని స్థానిక ఎస్సై బి బ్రహ్మయ్య కోరారు. మండలంలోని చిలువూరు గ్రామంలో మంగళవారం రాత్రి ఆయన గ్రామస్తులకు అవగాహన సదస్సును నిర్వహించారు. మే 13వ తేదీ గ్రామంలో ఎన్నికల సందర్భంగా ఇరు వర్గాల మధ్య గొడవలు జరిగాయి. గొడవలకు పాల్పడిన వారిలో కొందరిని ఇటీవల బైండోవర్ చేసి ఉన్నారు. ఎన్నికల ఫలితాలు సందర్భంగా ర్యాలీలు నిర్వహించవద్దని బాణాసంచా కాల్చవద్దని 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఎటువంటి కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని వద్దని కోరారు. కవ్వింపు చర్యలకు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

22వ తేదీ బుధవారం ట్రీకటింగ, విద్యుత్‌లైన్‌ల మరమ్మతుల నిమిత్తం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నము 2గంటల వరకు విద్యుత్ నిలిపివేయ బడునని విద్యుత్ శాఖ ఎఇ బి వీరాంజ నేయలు తెలిపారు. మండలం లోని వరగాని సబ్ స్టేషన్ పరిధిలోని వరగాని, అబ్బినేని గుంటపాలెం, గిరిజవోలు గుంటపాలెం, రావిపాడు, గోగులమూడి గ్రామాలకు విద్యుత్ నిలిపివేయబడునని, వినియోగదారులు సహకరించవలసినదిగా ఎఇ కోరారు.

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

33 కెవి విద్యుత్తు లైన్లు అత్యవసర మరమ్మత్తుల నిమిత్తం బుధవారం ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరం, కొలనుకొండ, కుంచనపల్లి గ్రామాలలో ఉదయం 9:30 నుండి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అక్కల సత్యనారాయణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు విద్యుత్ అంతరాయాన్ని గమనించి, విద్యుత్ అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.



బూడిద రేగుతున్న రాజధాని రోడ్డు

ప్రజాశక్తి - తాడేపల్లి :రాజధాని ముఖద్వారంగా ఉన్న ఉండవల్లి, పెనుమాక రోడ్లు బూడిదతో రేగుతున్నాయి. ఇబ్రహీంపట్నం నుండి ఈ మార్గంలో పెద్దఎత్తున బూడిద రవాణా అవుతోంది. 10 టైర్ల లారీల ద్వారా దీన్ని తరలిస్తుండడంతో రోడ్డుపై బూడిద పెద్దఎత్తున పేరుకుపోయి ప్రయాణికులను ఇబ్బందుల పాల్జే స్తోంది. అమరావతి - విజయవాడ ప్రధాన రహదారిలో ఉన్న ఈ మార్గంలో రోడ్డుపై అంగుళం మేరకు పేరుకున్న బూడిదతో వాహనాలు సరిగా కనిపించక ద్విచక్ర వాహనదారు లు అవస్థ పడుతున్నారు. వాహన రాకపోకల వల్ల ఈ బూడిద ఇళ్లల్లోకీ వచ్చి పడుతోందని, ఆహార పదార్థాలూ పాడవుతు న్నాయని స్థానికులు వాపోతున్నారు. ప్రజల నిరసనల మధ్య మంగళవారం సాయంత్రానికి వాటర్ ట్యాంకుల ద్వారా ఉండవల్లి సెంటర్ నుండి అనంతపద్మనాభ స్వామి గుహల వరకు రోడ్లపై పేరుకపోయిన బూడిద పైకి లేవకుండా నీరు చల్లించే పనులు చేపట్టారు. ఇంతటితో సరిపోదని, బూడిద వాహనాలు ఈ మార్గంలో రాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

25 నుండి చిన్నారులకు సమ్మర్ క్యాంప్

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

స్థానిక తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 25 వ తేదీ నుండి పిల్లల వేసవి శిక్షణా శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ట్రస్ట్ కన్వీనర్ దొప్పలపూడి రమేష్ బాబు మంగళవారం తెలిపారు. ఈ శిబిరంలో పిల్లల్లో ఉన్న నైపుణ్యాన్ని , సృజనాత్మకత ను వెలికి తీసేందుకు వివిధ రకాల ఆటలు ,పాటలు, కవితలు, కథలు, నృత్యం, క్విజ్ లాంటివి నేర్పి పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 5 రోజుల పాటు నిర్వహించే ఈ క్యాంప్ విజ్ఞాన కేంద్రంలో ప్రతి రోజు ఉదయం 9 గంటల నుండి 11గంటల వకు నిర్వహించ బడుతుం దన్నారు. విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను (1వ తరగతి నుండి 8వ తరగతి వరకు) ఈ క్యాంప్‌లో చేర్పించాలని డి రమేష్‌బాబు విజ్ఞప్తి చేశారు.

23న ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ

23 వ తేదీన తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రంలో జరిగే గురువారం ఉదయం 10గంటలకు కుట్టు శిక్షణ ముగింపు సభలో మహిళలకు ఉత్తర అమెరికా తెలుగు సంఘం వారు కుట్టు మిషన్లు ఉచితంగా పంపిణీ చేస్తారని, విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ కన్వీనర్ దొప్పలపూడి రమేష్ బాబు తెలిపారు.



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్ఆర్సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్ అప్పిరెడ్డి

సంక్షేమ పథకాలు గెలిపిస్తాయి : అప్పిరెడ్డి

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్రంలో రెండవసారి వైఎస్ఆర్సిపి అధికారంలోకి రావడం ఖాయమని వైఎస్ఆర్సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్ అప్పిరెడ్డి అన్నారు. మంగళవారం శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని సందర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ 151 సీట్లతో 2019 అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్ఆర్సిపి అధికారంలోకి వచ్చిందని, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పేద ప్రజలకు అందాయని అన్నారు. దీనివలన మరల రెండోసారి వైఎస్ఆర్సిపి అత్యధిక మెజార్టీతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని తెలిపారు. జూన్ 4న జరిగే కౌంటింగ్లో తెలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో వాసవి సత్ర సముదాయం అధ్యక్షులు డి వెంకటేశ్వర్లు, వాసవి సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఎం సూర్య వేణుగోపాలకృష్ణ పాల్గొన్నారు.

మహారాజశ్రీ అద్దంకి సీనియర్ సివిల్ జడ్జిగారి కోర్టు, అద్దంకి

EP No.14/2019 in OS 709/2016

బిట్వీన్:
కురుగంటి వెంకటరమణారెడ్డి ...D.H.R/వాది
మరియు
యద్దుల లక్ష్మి ...J.D.R/ప్రతివాది
To
యద్దుల లక్ష్మి భర్త శ్రీనివాసరెడ్డి, ప్రో. పూజిత కాటన్ ట్రెడర్స్, డోర్ నెం.25-12-42, 6వ లైను, శ్రీనివాసరావుపేట, గుంటూరు సిటీ,

పై నెంబరు EP 14/2019 ప్రతివాదులైన మీపై D.H.R EP ని దాఖలు చేసి ఉన్నారు. సదరు EPలో or 21 rule 66.64 of CPC నోటీసులు ఎన్నిసార్లు పంపినను మీరు తీసుకొనలేదు. గనుక EP షెడ్యూల్ దాఖల ఆస్తిని శ్రీ కోర్టు వారు ఎటాచ్‌మెంట్ చేసి ఉన్నారు గనుక సదరు EP షెడ్యూల్ దాఖల ఆస్తిని బహిరంగముగా వేలం వేయుచున్నారు. వేలం వేసి డిక్రి అమౌంట్‌ను D.H.Rకు ఇవ్వడానికి శ్రీకోర్టు వారు ఆర్డర్ వేసియున్నారు. సదరు విషయము పేపర్ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది. ఈ నెంబరు దావా సదరు EP షెడ్యూల్ ఆస్తిని వేలం నోటీసు నిమిత్తం ది.21-06-2024వ తేదికి వాయిదా ఉన్నది. గనుక తేది 21-06-2024న ఉదయం గం.10.30 ని.లకు పైన చెప్పిన కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియ జేయగలరు.

//శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో//

వాయిదా తేది:21-06-2024

బి.రామకోటయ్య,బి.ఎ., బి.ఎల్
అడ్వకేట్,
రాయనగర్, అద్దంకి,
సెల్:9985049244

IN THE COURT OF THE PRL. CIVIL JUDGE (SENIOR DIVISION) : : GUNTUR
S.O.P.No.16/2024

Between:
1.Peddi Naga Siromani
2.Peddi Mani Bindu
3. Peddi Kiranmani
4. Peddi Mani Bhushan ....Petitioners
AND
Link Intime India Pvt. Ltd.
Rep. by it's Authorised Officer
CIN:U67190MH118368,
B Tower, 102,B And 103, Shangrila Complex, 1st Floor, Opp. HDFC Bank, Near Radha Krishna Char Rasta, Akota,Vadodara 390020, Gujarat,
Tel:0265-6136000, Fax: 0265-2356791 ...Respondent

పై నంబరు గల Succession O.P లో పిటీషనర్లు అయివున్నారు. మరియు లేటు పెద్ది చలపతి రావు గారు 1వ వాదికి భర్త గారు మరియు 2 నుండి 4 వాదులకు తండ్రిగారు అయి వున్నారు. ప్రస్తుత కేసులో సదరు పెద్ది చలపతి రావు గారి పేరిటికి గల రెస్పాండెంట్ కంపెనీకి చెందిన Poushak Limited అను పేరు గల షేర్లు కలిగివుండి ఇంటెస్టేటు గా మరణిచినందువలన వారి ముఖ్య వారసులు అయిన పిటిషనర్లు సదరు పెద్ది చలపతి రావు గారి పేరుతో వున్న పౌషక్ లిమిటెడ్ కంపెనీ షేర్ నం.606923 నుండి 607522 వరకు వెరసి 600 షేర్లు 1వ వాది పేరుతో మార్పు చేయుటకు 2 నుండి 4 వాదులు తమకు ఎట్టి అభ్యంతరములు లేవని పై నంబరు గల Succession O.Pని దాఖలు చేసికొని వున్నారు. కావున సదరు పై నెంబరు గల కేసుపై ఎవరికైనా ఏవిధమైన అభ్యంతరములు వున్న ఎడల తెలుపుకొన వలసినదిగా శ్రీ కోర్టు వారు జనరల్ నోటీసు నిమిత్తము పేపరు ప్రకటన ద్వారా తెలియ జేయుటకు ది.26-06-2024 నకు ఆర్డరు వేసి వున్నారు. కావున ఆ రోజున ఉ.గం.10.30 నిలకు ఎవరికైనా ఆక్షేపణలు వున్నవారు పై తెల్పిన తేదీన శ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జ్ కోర్టు, గుంటూరు వారి ఎదుట ప్రత్యక్షముగా కానీ వారిచే నియమించబడు వకీలు గార్ల ద్వారా గాని హాజరై తమయొక్క అభ్యంతరములు తెలుపుకోగలరు, లేనిచో సదరు పై తెల్పిన కేసు మీ యొక్క పరోక్షమున తీర్మానించబడునని ఇందు మూలముగా మీకు తెలియజేయడమైనది.

వాయిదా తేదీ 26-06-2024

(శ్రీ కోర్టు వారి వుత్తర్వుల ప్రకారము)

చుండూరు సత్య సాయిబాబు,
పిటీషనర్లు తరుపు న్యాయవాది,
గుంటూరు, సెల్: 9392356995

IN THE COURT OF THE PRL. CIVIL JUDGE (SENIOR DIVISION) : : GUNTUR
S.O.P.No.37/2024

Between:
1.Shaik Azizunnisa
2. Shaik Ayesha @ Ayasha ...Petitioners
AND
1.Canara Bank Limited,
Rep. by it's Branch Manager,
Nagalaxmi Bldg., Near Junction,
Main Road, Pedakakani.
2.Mohammad Inaitulla ...Respondents

పై నంబరు గల Succession O.P లో పిటీషనర్లు అయివున్నారు. మరియు లేటు షేక్ బాయజీద్ గారు 1వ వాదికి భర్త గారు మరియు 2వ వాదికి మరియు 2 వ ప్రతివాదికి తండ్రిగారు అయి వున్నారు. ప్రస్తుత కేసులో సదరు షేక్ బాయజీద్ గారి పేరిటికి గల 1వ రెస్పాండెంట్ బ్యాంకులో డిపాజిట్లు అనగా A/C Nos.
1) 1311101017957 Amount Rs. 70,572/-
2) 1311101004442 Amount Rs. 6,98,722/-
Total Amount Rs. 7,69,294/- కలిగివుండి ఇంటెస్టేటు గా మరణిచినందువలన వారి ముఖ్య వారసులు అయిన పిటిషనర్లు మరియు 2వ ప్రతివాదులు 1వ పిటిషనరు బ్యాంకులో గల డిపాజిట్లను ముస్లిం వారసత్వ చట్టము ప్రకారము ఎవరి వాటాకు రాబడిన సొమ్మును వారి పంపిణీకి హక్కు పొందుటకు పై నంబరుగల కేసును పిటిషనర్లు వేసియున్నారు. తద్వారా డబ్బు బ్యాంకునుండి ఎవరి వాటాకు రాబడిన పైకమును బ్యాంకు డిపాజిట్లను రద్దు పరచి వారు వ్యక్తిగతముగా పిటిషనర్లు మరియు 2వ రెస్పాండెంట్ పొందుటకు ఎవరికైనా ఎట్టి అభ్యంతరములు వున్నను తెలుపుకొనవలసినదిగా శ్రీ కోర్టు వారు జనరల్ నోటీసు నిమిత్తము పేపరు ప్రకటన ద్వారా తెలియజేయుటకు ది.21-06-2024 నకు ఆర్డరు వేసి వున్నారు. కావున ఆ రోజున ఉ.గం.10.30 ని.లకు ఎవరికైనా ఆక్షేపణలు వున్నవారు పై తెల్పిన తేదీన శ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జ్ కోర్టు, గుంటూరు వారి ఎదుట ప్రత్యక్షముగా కానీ వారిచే నియమించబడు వకీలు గార్ల ద్వారా గాని హాజరై తమయొక్క అభ్యంతరములు తెలుపుకోగలరు, లేనిచో సదరు పై తెల్పిన కేసు మీ యొక్క పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

వాయిదా తేదీ 21-06-2024

(శ్రీ కోర్టు వారి వుత్తర్వుల ప్రకారము)

చుండూరు సత్య సాయిబాబు,
పిటిషనర్లు తరుపు న్యాయవాది,
గుంటూరు సెల్: 9392356995

మహారాజశ్రీ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్ట్ @ తెనాలి
క్రెడిటర్ ఐ. పి. నెంబర్ 10 / 2024

బిట్వీన్
గోపాలం పాండురంగారావు మరియు ఇద్దరు
.... పిటిషనర్లు/క్రెడిటర్లు
తోట వీరరాఘవయ్య మరియు ముగ్గురూ
...రెస్పాండెంట్స్
టు
1. తోట వీరరాఘవయ్య తండ్రి వెంకట రత్తయ్య, వయసు 55, డోర్ నెంబర్ 1-14, పెరవలిపాలెం గ్రామం, వేమూరుమండలం, బాపట్లజిల్లా - 522261.
2. తోట చంద్రశేఖర తండ్రి వెంకటేశ్వర్లు, వయసు 33, డోర్ నెంబర్ 2-73, నందిగామ గ్రామం, సత్తెనపల్లి మండలం, పలనాడు జిల్లా, పిన్ నెం.522403.
3. తోట శివబాజీ తండ్రి వెంకటేశ్వర్లు, వయసు 32, డోర్ నెంబర్ 2-73, నందిగామ గ్రామం, సత్తెనపల్లి మండలం, పలనాడు జిల్లా, పిన్ నెం. 522403.
4. ది అఫీషియల్ రిసీవర్, జిల్లా కోర్ట్ కాంప్లెక్స్ గుంటూరు, గుంటూరు జిల్లా.

పైన నెంబర్ ఐ.పీ.లోని మొదటి రెస్పాండెంట్ను ఇన్సాలెన్సీగా డిక్లేర్ చేయమని కోరుతూ పైన తెలిపిన పిటిషనర్లు కోర్టు వారిని కోరి ఉన్నారు. ఈ పిటిషన్ పై అభ్యంతరములు ఉంటే తెలుపుకోవాల్సిందిగా శ్రీ కోర్టు వారు 22-06-2024 వాయిదా వేసి ఉన్నారు, కావున సదరు వాయిదా తేదీన ఉదయం 10 గంటల 30 నిమిషాలకు స్వయంగా గాని, న్యాయవాది గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో ఈ పిటిషన్‌ను మీ పరోక్షమందు తీర్మానించ బడును.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేదీ : 22 -06-2024

ఇట్లు
సింగంశెట్టి శివకామేశ్వరరావు
(B.com, LL.M)
అడ్వకేట్, తెనాలి.
సెల్ నెం.99599 27596.

గవర్నర్‌కు కలెక్టర్, ఎస్పీ స్వాగతం

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ మంగళవారం గుంటూరు వచ్చిన సందర్భంగా ఆయనను రైల్వే స్టేషన్ వద్ద జిల్లా కలెక్టర్ యం.వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా ఎస్పీ తుషార్ దూడి పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ ట్రైన్ ద్వారా నెల్లూరు బయలుదేరి వెళ్లారు.



పుష్పగుచ్ఛం అందచేస్తున్న కలెక్టర్

విద్యుత్, తాగునీటి సరఫరాపై జవహర్‌రెడ్డి సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి మంగళవారం వెలగపూడి రాష్ట్ర సచివాలయం నుండి విద్యుత్, ఉపాధిహామీ పనులు, త్రాగునీటి సరఫరా తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా జవహర్‌రెడ్డి జిల్లాల వారీగా ప్రస్తుతం విద్యుత్ సరఫరా జరుగుతున్న విధానం, ఉపాధి హామీ పనులు , గ్రామాల్లో , పట్టణాలలో త్రాగునీటి సరఫరా విధానంపై సమీక్ష నిర్వహించారు. అదే విధంగా పోస్టల్ బ్యాలెట్ , ఈవియం స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రత, ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెలువడిన తరువాత శాంతి భద్రతలకు సంబంధించి చేపట్టాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలపై సమీక్ష నిర్వహించి సూచనలు అందించారు. ఈవీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ వీసీ సమావేశ మందిరం నుండి సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, డ్వామా పీడీ సరస్వతి, భూగర్భ జల వనరుల శాఖ డీడీ వందనం, మంగళగిరి – తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ నిర్మల్ కుమార్, పొన్నూరు మున్సిపల్ కమిషనర్ నయీం అహ్మద్ , సిపిడిసిఎల్ ఎస్.ఈ లు మురళి కష్ణ యాదవ్ , విజయ్ కుమార్ , ఆర్ డబ్ల్యు ఎస్ , ఇరిగేషన్ శాఖల ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ నుండి సమావేశంలో పాల్గొన్న జేసీ రాజకుమారి

నేడు తుమ్మపూడిలో సిపిఎం నాయకులు

వల్లభనేని సాంబశివరావు ప్రథమ వర్ధంతి సభ



ప్రజాశక్తి దుగ్గిరాల : సిపిఎం తెనాలి డివిజన్, దుగ్గిరాల మండల పూర్వ కార్యదర్శి వల్లభనేని సాంబశివరావు ప్రథమ వర్ధంతి సభను దుగ్గిరాల మండలం తుమ్మపూడిలో నిర్వహిస్తున్నామని మండల కార్యదర్శి జెట్టి బాలరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాంబశివరావు స్వగ్రామం తుమ్మపూడిలో నిర్వహించే సంస్మరణ సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు, సీనియర్‌నాయకులు జొన్నా శివశంకరరావు తదితరులు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఉదయం 10గంటలకు ప్రారంభమయ్యే సభలో పార్టీ శ్రేణులు సానుభూతిపరులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా ఆయన కోరారు.

నేడు జొన్నకూటి వీర్లంకయ్య వర్ధంతి సభ



ప్రజాశక్తి - తుళ్లూరు

తుళ్లూరు ప్రాంతంలో సిపిఎం నాయ కులుగా, కమ్యూనిస్టు వీర్లంకయ్యగా గుర్తింపు పొందిన జొన్నకూటి వీర్లంకయ్య మూడవ వర్ధంతి సభను బుధవారం సాయంత్రం 6 గంటలకు సిపిఎం ఆధ్వర్యంలో తుళ్లూరులో నిర్వహించనున్నట్లుగా సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి ఒక ప్రకటనలో తెలిపారు. వీర్లంకయ్య తుళ్లూరు ప్రాంతంలో ప్రజా సమస్యలపై నికరంగా నిలబడి పనిచేసేవారని, కమ్యూనిస్టు వీర్లంకయ్యగా ప్రజలు పిలిచేవారని అన్నారు. రైల్వే ఉద్యోగిగా బాధ్యతలు నిర్వహిస్తూ కూడా రైతు, వ్యవ సాయ కార్మిక సంఘాల బాధ్యుడిగా వారి సమస్య పరిష్కారం కొరకు ముందుండేవారని అన్నారు. ఉద్యోగం నుండి రిటైర్డ్ అయిన తర్వాత తన సమయాన్నంతా ప్రజా సమస్యల పరిష్కారం కొరకే కేటాయించే వారిని అన్నారు.ప్రజా నేత వీర్లంకయ్య మూడవ వర్ధంతి సభలో రాజధాని ప్రాంతంలోని సిపిఎం శ్రేణులతో పాటు రైతులు, కూలీలు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయవలసిందిగా రవి విజ్ఞప్తి చేశారు.



సిరివెన్నెల చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అవగాహన సభ్యులు

అవగాహన ఆధ్వర్యంలో సిరివెన్నెల జయంతి

ప్రజాశక్తి-గుంటూరు : తెలుగు భాష ఉన్నంతకాలం సిరివెన్నెల జీవించే ఉంటారని, తెలుగు అక్షరం సాగినంత వరకూ ఆయన ప్రజల మనసుల్లో ఉంటారని వక్తలు పేర్కొన్నారు. అవగాహన సంస్థ ఆధ్వర్యంలో అరండల్ పేటలోని సంస్థ కార్యాల యంలో సిరివెన్నెల సీతారామ శాస్త్రి జయంతి నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో రచయిత్రి పింగళి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ తెలుగుపాటను ప్రేమించే వారంతా సిరివెన్నలను ఎప్పటికీ మరిచిపోరని అన్నారు. సిరివెన్నెల పాటలను అంతులోని అగాధం, అందుకోలేని ఆకాశంగా చెప్పుకోవచ్చన్నారు. కవిగానే బతికి, కవిత్వాన్ని శాసించిన సిరివెన్నెల పాటగా మిగిలిపోయాడని అన్నారు. మధుమేహ వ్యాధి నిపుణులు డాక్టర్ వి.వి.రామ్‌కుమార్ మాట్లాడుతూ మూడున్నర దశాబ్దాలుగా సినిమా రంగంలో విశిష్ట గేయ రచయితగా విశేషాదారణ పొందిన సిరివెన్నెల చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. కార్యక్రమంలో సంగీత విధ్వాంసుడు వి.ఎస్.ఎన్ మల్లేశ్వరరావు, గాయకులు సాయిబాబు, మాదవి, అప్పారావు, పిచ్చయ్య తదితరులు సిరివెన్నెల పాటలను ఆలపించారు.



మాట్లాడుతున్న కలెక్టర్

కౌంటింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన ఉండాలి

గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

ఆచార్య నాగార్జునా యూనివర్సిటీలో జూన్ 4 తేదీన జరిగే సార్వత్రిక ఎన్నికలు-2024 కౌంటింగ్ ప్రక్రియపై రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు పూర్తి అవగాహన కలిగి వుండాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం.వేణు గోపాల్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కలక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలు, నోడల్ అధికారులతో ఎన్నికల కౌంటింగ్, పోస్టల్ బ్యాలెట్, ఈవియంలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియలో మొదటిగా పోస్టల్ బ్యాలెట్స్, సర్వీస్ ఓట్లు లెక్కించడం జరుగుతుందన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం పోస్టల్ బ్యాలెట్ ప్రీ కౌంటింగ్‌లో వ్యాలిడ్, ఇన్ వ్యాలిడ్ ఓట్లు ఎలా వేరు చేయాలో వివరించారు. లెక్కింపునకు సంబంధించిన సూచనలు ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలు అందరూ తప్పక చదవాలన్నారు. ఎలెక్షన్ కమిషన్ ఏ సందర్భంలో ఏమి చేయాలో మార్గదర్శకాలలో వివరించారని అందరూ చదివి నిబంధనలు ఆకళింపు చేసుకోవాలన్నారు. జెసి జి. రాజకుమారి మాట్లాడుతూ ఆర్‌ఓలు, ఏఆంఓలు పూర్తి బాధ్యత కలిగి వుండాలని, కౌంటింగ్‌కు వచ్చే సిబ్బంది అందరికీ ఐడి కార్డులు అందించాలన్నారు. గుంటూరు పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజ కవర్గాల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఆచార్య నాగార్జునా యూనివర్సిటీలో మూడంచల పోలీసు భద్రత వున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరికీ ఐడి కార్డులు వుండాలన్నారు. ఏఎన్‌యులో ఏ నియోజకవర్గానికి ఎలా వెళ్లాలో తెలిపే సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని, కౌంటింగ్ హాల్ దగ్గర రిసెప్షన్ కౌంటర్, హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలన్నారు. కౌంటింగ్ సిబ్బందికి, హమా లీలకు పార్లమెంట్‌కు, అసెంబ్లీ కౌంటింగ్ హాళ్లకు ఏ రూట్‌లో వెళ్లాలో హెల్ప్‌డెస్క్‌ల ద్వారా తెలియజేయలన్నారు. సెల్‌ఫోన్లకు కౌంటింగ్ హాల్‌లో అనుమతి లేనందున ఉద్యోగులకు, కౌంటింగ్ ఏజెంట్లకు , అభ్యర్థులకు సెల్‌ఫోన్ల డిపాజిట్ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. రిజర్వ్ టీములకు ప్రత్యేక హాల్ ఏర్పాటు చేయా లన్నారు. కౌంటింగ్ ఏజెంట్లకు జాతీయ, రాష్ట్ర, ఇండిపెండెంట్‌ల వారీగా సీట్లు ఏర్పాటు చేయాలన్నారు. లెక్కింపునకు 14 టేబుల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు ఈ సందర్భంగా తెలియజేశారు. విద్యుత్ అంతరాయం లేకుండా జనరేటర్లు ఏర్పాటు చేయాలన్నారు. మొదటి ర్యాండమైజేషన్ నిర్వహించి కౌంటింగ్ సిబ్బందికి ఈనెల 25, 26 తేదీలలో కలెక్టరేట్‌లో మొదటి శిక్షణ కార్యక్రమాలు, రెండవ ర్యాండమైజేషన్ నిర్వహించి జూన్ 3వ తేదీన ఏ.ఎన్.యులో రెండవ శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. మూడవ ర్యాండమైజేషన్ నిర్వహించి సిబ్బందికి కౌంటింగ్ విధులు కేటాయిస్తామని ,ఎన్నికల పరిశీలకులు సంతకం చేసిన తదుపరి మాత్రమే రౌండ్‌ల వారీగా ఫలితాలు వెల్లడించాల్సి వుంటుంద న్నారు. అనంతరం సర్వీస్ ఓటర్లు ఎలక్ట్రోనికల్లీ ట్రాన్స్మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ సిస్టమ్ (ఈటీపిబిఎస్) ప్రీ కౌంటింగ్ పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించడం జరిగింది. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్ , అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) పవార్ స్వప్నిల్ జగన్నాథ్, డిఆర్‌ఓ పెద్ది రోజా, డిప్యూటీ కలెక్టర్ స్వాతి, ఆర్డిఓ శ్రీఖర్, డిఆర్డిఏ పీడీ హరిహరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపు ప్రక్రియలో అలసత్వం వద్దు

పల్నాడు జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లత్కర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మంగళవారం జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి శ్రీకేశ్ బి లత్కర్,జాయింట్ కలెక్టర్ ఏ. శ్యాం ప్రసాద్,ఎస్పీ మల్లికా గార్గ్ తో కలిసి నరసరావుపేట, కాకాని వద్దగల జేఎన్టీయూలో ఓట్ల కౌంటింగ్ ఏర్పాట్లను నిశితంగా పరిశీలించారు. అనంతరం ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి సిబ్బందితో జిల్లా కలెక్టర్ చర్చించారు. ఏర్పాట్లు ప్రకడ్బందీగా చేయాలని, ఓట్ల లెక్కింపు ప్రక్రియలో సిబ్బంది ఎవరు అలసత్వం ప్రదర్శించకూడదని, పార్లమెంటు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సిబ్బందిని ఏర్పాటు చేయాలని విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. లెక్కింపు ప్రక్రియలో పాల్గొనే సిబ్బందికి అన్ని వసతులు ఏర్పాటు చేశారా లేదా వివరాలు అడిగి తెలుసుకున్నారు. కౌంటింగ్ రోజు జేఎన్టీయూ ప్రహరీ గోడ చుట్టూ 100 మీటర్లు వరకు బారికేడింగ్ ఏర్పాటు చేయాలని 100 మీటర్ల లోపలికి ఏ వాహనాన్ని అనుమతించకూడదని తెలిపారు . ప్రధాన ద్వారం వద్ద పోలింగ్ ఏజెంట్లను అభ్యర్థులను కౌంటింగ్ సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపల పంపి%శీ%చాలన్నారు. సంబంధిత నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు ముందుగానే కౌంటింగ్ ఏజెంట్లకు, అభ్యర్థులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని కౌంటింగ్ రోజున నిర్వహించవలసిన విధివిధానాల గురించి అవగాహన కల్పించాలన్నారు. స్ట్రాంగ్ రూములను అభ్యర్థులు ఏజెంట్ల సమక్షంలో తెరిచే విధంగా చర్య తీసుకోవాలన్నారు. కౌంటింగ్ సిబ్బందికి ముందస్తుగానే బ్రీఫింగ్ చేయాలని ప్రతి నియోజకవర్గ కౌంటింగ్‌లో సంబంధిత రిటర్నింగ్ అధికారి ఇన్చార్జిగా వ్యవహరిస్తారన్నారు. ఎన్నికల అనంతరం జరుగుతున్న పరిణామాల మీద ప్రత్యేక నిఘా ఉంచడం జరుగుతుంది అన్నారు.జిల్లాలో ఎన్నికల కోడ్ అమలు లో ఉన్న నేపథ్యంలో ఫలితాలు వెలువడిన 2 రోజుల వరకు ర్యాలీలు,ఊరేగింపులు నిర్వహించడం కానీ బాణాసంచాలు కాల్చడం అంటివి గాని నిషేధమని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాచర్ల రిటర్నింగ్ అధికారి మరియు జాయింట్ కలెక్టర్ ఏ శ్యాం ప్రసాద్, రిటర్నింగ్ అధికారి రమణ కాంత్ రెడ్డి,నరసరావుపేట ఆర్డీఓ పి. సరోజిని , ఈవీఎం నోడల్ అధికారి అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కౌంటింగ్ ఏర్పాట్లపై చర్చిస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లత్కర్ , జెసి ఏ. శ్యాం ప్రసాద్

వేసవి విజ్ఞాన శిబిరాలను ఉపయోగించుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లా గ్రంధాలయం, 97 శాఖా గ్రంధాలయాలలో ఈనెల 15 నుండి జూన్ 7వ తేదీ వరకూ నిర్వహిస్తున్న ఉచిత వేసవి విజ్ఞాన శిబిరాలను వినియోగించుకోవాలని జిల్లా గ్రంధాలయ సంస్థ కార్యదర్శి వి.సుబ్బరత్నమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. 6-10వ తరగతుల విద్యార్థులు ఈ శిబిరాలలో పాల్గొనవచ్చని, డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లీషు, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్స్, మ్యూజిక్ ఇంగ్లీషు గ్రామర్, జ్యూవెలరీ మేకింగ్, ఇతర అంశాలపై ఉచితంగా శిక్షణ ఇప్పించి, ప్రతి వారం విద్యార్థులకు పోటీలు నిర్వహించి, బహుమతులు ప్రదానం చేయటం జరుగుతుందన్నారు. అలాగే పిల్లలు గ్రంధాలయాలకు వచ్చేలా, పిల్లల్లో పుస్తక పఠనంతోపాటు విజ్ఞానాన్ని పెంపొందించుకునేలా, వారిలో సృజనాత్మకతను పెంచే విధంగా ఈ ఉచిత వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు అరండల్‌పేట 5వ లైనులోని జిల్లా కేంద్ర గ్రంధాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే శిక్షణ ఇవ్వటానికి ఆసక్తి ఉన్న టీచర్లు, రిటైర్డ్ ఉద్యోగులు, రచయితలు, కవులు, స్వచ్ఛంద సంస్థలు ఇంకా ఎవరైనా రిసోర్స్ పర్సన్లు తమ వివరాలు తెలియజేయాలని కోరారు.